# 15

# వివక్షతతో జీవించుట

## (7:1-29)

యేసు ఉపదేశించిన కొండ మీద ప్రసంగములోని చిట్టచివరి భాగంలో, ఆయన వేషధారణ, ప్రార్థన, నీతివంతమైన జీవితమునకు కావలసిన న్యాయసమ్మతమైన నియమము, మరియు సత్యమునకు శ్రద్ధాళువుతో కూడిన విధేయత చూపుట మొదలగు వాటిని ప్రధానాంశములుగా తీసికొని ప్రబోధించాడు. ఇతరులకు తీర్పు తీర్చుటలో విమర్శనాత్మకముగా నుండుట గూర్చి ఆయన హెచ్చరించాడు (7:1–6). వారు దేవుడిచ్చు మంచి యీవులను వెదుకుచు, పట్టుదలతో ప్రార్థన చేయుట గూర్చి యేసు తన శ్రోతలను మందలించాడు (7:7–11). "సువర్ణ సూత్రము" అని ప్రసిద్ధిగాంచిన, ఒకరి యెడల మరొకరు పరస్పరము అన్యోన్యముగా వ్యవహరించు సూత్రమునిచ్చాడు (7:12). కొండ మీద ప్రసంగమునకు ఒక ముగింపు ఒత్తిడిగా, వారు ఏదో ఒక దానిని ఎంపికచేసికొనవలసినదేనని తన శ్రోతలను సవాలు చేసిన తారతమ్యముల పరంపర నొకదానిని ఆయన నివేదించాడు (7:13–27). ఆయన తన ఉపదేశములను ముగించిన పిదప, జనసమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడిరి (7:28, 29).

### నీతివంతమైన తీర్పు (7:1–6)

**1మీరు తీర్పు తీర్చకుడి, అప్పుడు మిమ్మునుగూర్చి తీర్పు తీర్చబడదు. 2మీరు తీర్చు
తీర్పు చొప్పుననే మిమ్మును గూర్చియు తీర్పు తీర్చబడును, మీరు కొలుచుకొలత చొప్పుననే
మీకును కొలువబడును. 3నీ కంటిలోనున్న దూలము నెంచక నీ సహోదరుని కంటిలోనున్న
నలుసును చూచుట యేల? 4నీ కంటిలో దూలముండగా, నీవు నీ సహోదరుని
చూచి–నీ కంటిలో నున్న నలుసును తీసివేయనిమ్మని చెప్ప నేల? 5వేషధారీ, మొదట నీ
కంటిలో నున్న దూలమును తీసివేసికొనుము, అప్పుడు నీ సహోదరుని కంటిలోనున్న
నలుసును తీసివేయుటకు నీకు తేటగా కనబడును.**

**6పరిశుద్ధమైనది కుక్కలకు పెట్టకుడి, మీ ముత్యములను పందులయెదుట
వేయకుడి; వేసినయెడల అవి యొకవేళ వాటిని కాళ్ళతో త్రొక్కి మీమీద పడి మిమ్మును
చీల్చి వేయును.**

యేసు ఆరవ అధ్యాయంలో చింతించుట గూర్చి బోధించిన తరువాత ఏడవ అధ్యాయంలో తీర్పు గూర్చి చెప్పుటకు మొదలుపెట్టి, వారు ఆతురపడి ఇతరుల యెడల వ్యతిరేకార్థక తీర్పులు తీర్చకూడదని బోధించాడు. ఆయన శిష్యులు సమస్త తీర్పులను మరచిపోవలెనని ఆయన ఉపదేశించలేదు, ఏలయనగా దేవుని రాజ్యములో ఒక పౌరుడుగా జీవించుటనుబట్టి నీతివంతమైన విచక్షణ అవసరమై యున్నది.

**వచనము 1. మీరు తీర్పు తీర్చకుడి అప్పుడు మిమ్మును గూర్చి తీర్పు తీర్చబడదని** యేసు ఆజ్ఞాపించాడు. యేసు ప్రతిపాదించిన నిషేధము - *mē* ఒక విధివాచక వర్తమాన క్రియాపదముతో నున్న గ్రీకు భాష నిర్మాణము – పురోగమనము చెందుచున్న చర్యను విరమించుకొనవలసినదిగా సాధికారముతో కోరుచున్నది. NLTలో "ఇతరులకు తీర్పు తీర్చుట ఆపుము" అని వ్రాయబడియున్నది. యేసు ఎటువంటి తీర్పునైనను ఉద్ఘాటింపుగా నిరసించుచున్నాడు? ఇతర వాక్యభాగముల ఆధారంగా, విషయము అది కాదని మనకు తెలియుచున్నది. ఉదాహరణ ఇదే కొండ మీద ప్రసంగములో అటుతరువాత, ఆయన "అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్తపడుడి … . వారి ఫలముల వలన మీరు వారిని తెలిసికొందురు" అని చెప్పాడు (7:15, 16). ఈ ఉపదేశకులు అసలైనవారో లేక అబద్ధమైనవారో నిర్ధారించుకొనుటకును, వారి "ఫలములు" మంచివో లేక చెడ్డవో నిర్ణయించుకొనుటకును ఈ ఉపదేశకుల సిద్ధాంతము మరియు వారి జీవిత శైలి గూర్చి తీర్పు తీర్చవలసి యున్నది ఆయన తెలియజెప్పుచుండెను. యోహాను వ్రాసిన సువార్తలో, యేసు "వెలి చూపునుబట్టి తీర్పు తీర్చక న్యాయమైన తీర్పు తీర్చుడని" కూడ సెలవిచ్చాడు (7:24). ఆయన ఉద్బోధ పూర్తిగా ఒకరి సొంత గీటురాయిపై ఆధారపడి తీర్చబడు వ్యక్తిగతమైన తీర్పును నిషేధించుచున్నది, కానీ తీర్పుకు సంబంధించిన దేవుని నీతివంతమైన ప్రమాణము ప్రయోగింపబడవలెనని అది విన్నవించుకొనుచున్నది.

"తీర్పు తీర్చకుడి" అని యేసు పలికిన వాంగ్మూలము మంచి చెడులను వివేచించుటను ఖండించుట లేదు, ఏలయనగా మనము ఈ తీర్పులు తీర్చవలెనని ఇతర లేఖన భాగములలో ఆజ్ఞాపింపబడి యున్నాము (రోమీయులకు 16:17, 18; 1 కొరింథీయులకు 5:9–13; 2 కొరింథీయులకు 6:14–18; గలతీయులకు 1:9; తీతు 1:9–14; 3:10, 11; 1 యోహాను 4:1–3; 2 యోహాను 9–11; యూదా 3, 4). యేసు మాటలు సంఘ క్రమశిక్షణను ఖండించుచున్నవని అనుకొనవద్దు. యేసు తానే, 18:15–18లో, దాని గూర్చిన ఆజ్ఞ నిచ్చాడు, పౌలు కూడ ఇటువంటి ఆజ్ఞనే ఇచ్చాడు (1 కొరింథీయులకు 5:1–5; 2 థెస్సలొనీకయులకు 3:6, 14, 15). ఒక సహోదరునికి దేవుని నీతివంతమైన ప్రమాణము ప్రకారము తీర్పు తీర్చకుండా అతడు తప్పిదము చేసాడని (గలతీయులకు 6:1 చూడు) మనకెలా తెలుస్తోంది?

కాబట్టి, యేసు జారీ చేసిన ఆజ్ఞ, కొండ మీద ప్రసంగము యొక్క సందర్భానుసారంగా – దేవుని నీతికిని శాస్త్రులు పరిసయ్యుల నీతికిని (5:20) మధ్య నున్న తారతమ్యమును తెలిసికొనవలెనను దృక్పథంతో – దృష్టించబడవలెను. "తీర్పు తీర్చుడి" అను అర్థమిచ్చుటకు ప్రయోగింపబడిన గ్రీకు పదము (*krinō*) తీర్పులను ఏర్పరచుకొనుట, ఎన్నుకొనుట, లేక నిర్ధారించుకొనుటను సూచించగలదు. ఈ వాక్యభాగములో, శాస్త్రులు మరియు పరిసయ్యులు ప్రదర్శించినటువంటి స్వనీతిని మరియు కఠోరమైన తీర్పుతీర్చవలెనను వైఖరులను యేసు ఖండించుచుండెనని స్పష్టముగా తెలియుచున్నది. ఆయనను వెంబడించువారు ఇటువంటి స్ఫూర్తికి దూరముగా నుండవలెనని ఆయన తెలియజెప్పుచుండెను. ఆయన ఇచ్చిన ఆజ్ఞ వెలిచూపులనుబట్టి తీర్పుతీర్చుటను లేక మరొకరి ప్రేరణలకు లేక హృదయమునకు తీర్పుతీర్చుటను నిషేధించుచున్నది (యోహాను 7:24; 1 కొరింథీయులకు 2:11 చూడు). తన సొంత పాపములను చూచుకొనుటకు నిరాకరించుచునే (7:3, 4), మరొకరి జీవితములో

ఏదో ఒక పొరపాటు కొరకు ఎల్లప్పుడు వెదకుచుండెడువాని వైఖరిని కూడ అది ఖండించు చున్నది. మనము మరొక వ్యక్తిపై నిత్య తీర్పును తీర్చజాలము, ఏలయనగా మనకందరికిని నీతిమంతుడైన న్యాయాధిపతి, యేసు క్రీస్తు చేత తీర్పు తీర్చబడును (యోహాను 5:22, 23; రోమీయులకు 2:1, 2; 14:4, 10–12; 2 కొరింథీయులకు 5:10; 2 తిమోతి 4:8; ప్రకటన 20:11–15).

మైదానము మీద చేయబడిన ప్రసంగములో, యేసు పలుకులు కనికరము సందర్భములో వ్రాయబడి యున్నవి: "కాబట్టి మీ తండ్రి కనికరముగలవాడై యున్నట్టు, మీరును కనికరముగలవారై యుండుడి, తీర్పు తీర్చకుడి, అప్పుడు మిమ్మును గూర్చి తీర్పు తీర్చబడదు: నేరము మోపకుడి, అప్పుడు మీ మీద నేరము మోపబడదు. క్షమించుడి, అప్పుడు మీరు క్షమింపబడుదురు" (లూకా 6:36, 37). ఒక వ్యాఖ్యానకర్త ఇలా చెప్పుచున్నాడు, "మనము క్షమింపబడి యున్నాము గనుక మనము క్షమించినట్టుగానే, దేవుడు మన యెడల అత్యంత ఔదార్యముతో వ్యవహరించాడు కాబట్టే, ఇతరులకు తీర్పు తీర్చుటలో మనము కూడ ఉదారతా స్వభావముగలవారమై యుంటున్నాము."[1]

**వచనము 2**. తీర్పు తీర్చుటకు వ్యతిరేకముగా ఆయన ఇచ్చిన ఆజ్ఞకు యేసు ఆధారమును సమకూర్చాడు: **మీరు తీర్చు తీర్పు చొప్పుననే, మిమ్మును గూర్చియు తీర్పు తీర్చబడును: మీరు కొలుచు కొలత చొప్పుననే, మీకును కొలువబడును.** ఈ వచనము "తీర్పు" (*krimati krinete krithēsesthe*) మరియు "కొలత" (*metrōi metreite metrēthēsetai*) అను పదముల పునరుక్తమును ఛందోబద్ధముగా వినియోగించుచున్నది. దీనినే, "మీరు ఎటువంటి తీర్పు తీర్చుదురో, మీకును అదే తీర్పు తీర్చబడును: మరియు ఏ కొలతతో కొలుతురో, మీకును అదే కొలత కొలువబడును" అని మరొక అక్షరార్థముగా అనువదించవచ్చును.

ఈ వచనము, దానిలో "తీర్పు తీర్చుట" మరియు "కొలత కొలచుట" అను పదములు సమానములై యున్న సమానార్థక సమానాంతరము కలిగియున్నది. కొలత కొలుచుట గూర్చి యేసు ప్రయోగించిన భాష బహుశా అటువంటి సందర్భాలలో నలుగురు చెప్పుకొనుచుండినదై యుండవచ్చును (మార్కు 4:24; లూకా 6:38 చూడు). మిశ్నా ఇలా సెలవిచ్చుచున్నది, "ఒకడు ఏ కొలతతో కొలుచునో, వానికి మరలా అదే కొలతతో కొలువబడును."[2] ఈ రూపకాలంకారము సంత వీధిలో నుండి ఉత్పాదింపబడినది, అచ్చట కొనుగోలు చేయువాడు కొనదలచిన వస్తువును, అమ్మకందారు దాని సముచితమైన మొత్తమును కొలచును. మైఖేల్ జే. విల్కిన్స్ ఇలా వివరించుచున్నాడు, " 'కొల' అనునది బరువును లేక పొడవు/వెడల్పును కొలుచుటకు ఉపయోగింపబడిన ఒక కొలబద్ద, లేక ఒక పాత్ర లేక ఒక దండము అయియుండవచ్చును, కానీ అది తరుచుగా, ఇచ్చట ఉపయోగింపబడుచున్నట్లుగా, అలంకారయుక్తంగా ఉపయోగింపబడినది (23:32 పోల్చి చూడు)."[3]

యేసు నిషేధించినటువంటి తీర్పులు తీర్చు విషయంలో ఒకడు జాగ్రత్తపరుడై యుండవలెను ఏలయనగా వానికి సహితము ఇతరులకు తీర్పు తీర్చుటకు వాడుపయోగించిన అదే పరిమాణంలో తీర్పు తీర్చబడుతోంది. మనము ఇతరులకు తీవ్రముగా తీర్పు తీర్చుట్లయితే, దేవుడు, సర్వోన్నతమైన న్యాయాధిపతియైనవాడు, మనకు తీవ్రముగా తీర్పు తీర్చునని ఎదురుచూడవలెను. టాల్మడ్ ఇలా సెలవిచ్చుచున్నది, "తన పొరుగువాని మీదికి

[దైవికమైన] తీర్పును ఆమంత్రణము చేయువాడు, మొదట [వాని సొంత పాపములనుబట్టి] వాడే శిక్షింపబడును."[4] డేవిడ్ హిల్ ఇలా వివరించుచున్నాడు, "యూదా మత బోధకుల ప్రకారము, దేవుడు లోకమునకు రెండు 'కొలతల' [చర్యల] కనికరము మరియు న్యాయము – ద్వారా తీర్పు తీర్చాడు."[5] దేవుడు వాని యెడల కనికరము కనుపరచునట్లు ఒకడు ఇతరుల యెడల కనికరముగలవాడై యుండవలెను (యాకోబు 2:13).

**వచనములు 3, 4.** ఆయన తెలియజెప్పుచుండిన విషయాలను వివరించుటకు యేసు పరస్పరము సంబంధము కలిగియుండిన రెండు సోదాహరణ చిత్రీకరణములను సమకుర్చాడు. మొదటిది, ఇతరలలో ఒక తప్పును పట్టుకొనుట (**చూచుట**; 7:3), రెండవది దానిని సరిచేయుటకు సంబంధించినది (తీసి**వేయనిమ్ము**; 7:4). అది అంగీకరింపబడకపోయినప్పటికిని, ఆచరణలో, యేసు ఇలా ప్రశ్నించాడు, "నీవే ఇంత పెద్ద తప్పు చేసి, నీ సహోదరుడు చేసిన చిన్న తప్పునుబట్టి వానిని నీవెలా విమర్శించగలవు?" **నలుసు** (*karphos*) అని అనువదింపబడిన గ్రీకు పదము ఎండు గడ్డి పోచను లేక కర్ర కణమును సూచించుచున్నది. NIVలో "రంపపు పొట్టు వంటి నలుసు" అని వ్రాయబడియున్నది NJBలో "కర్ర పుడక" అని వ్రాయబడి యున్నది. తీర్పు తీర్చబడుచుండిన ఈ వ్యక్తి జీవితములోని పాపమును యేసు సమర్థించలేదు, కానీ వాడు చేసిన చిన్న పాపమునకును, వానిని విమర్శించుచుండినవాడు చేసిన పెద్ద పాపమునకును మధ్య గల తారతమ్యమును ఆయన సూచించుచుండెను. **దూలము** అని అనువదింపబడిన గ్రీకు పదము (*dokos*) కర్ర దూలమును దేనినైనను, ఒక ఇంటి పైకప్పునకు ఆధారంగా ఉపయోగింపబడుదానిని కూడ, సూచించవచ్చును. యేసు ఇచ్చట ప్రయోగించిన అలంకారము ఒక "వడ్రంగిగా" (*tektōn*) లేక ఒక "భవన నిర్మాణకుడుగా" ఆయన కలిగియున్న అనేక సంవత్సరముల అనుభవము నుండి తీసుకొనబడి యుండవచ్చును (13:55; మార్కు 6:3).

ప్రసంగములోని అదివరకటి భాగములో వలెనే, ఆయన తన ఆలోచనను సుస్పష్టము చేయుటకు యేసు అతిశయోక్తులను వినియోగించాడు (5:23, 24, 29, 30, 34–36, 40 చూడు). ఏదిఏమైనా, ఆయన ఇచ్చట ఉపయోగించిన అతిశయోక్తి–అలంకారము ఎక్కువ హాస్యరసముగలదై యున్నది, అది కుందేటి కొమ్మువలె అర్థరహితమైనదై కూడ ఉన్నది. బహుశా అది యేసు చెప్పుచుండిన ఒంటె సూది బెజ్జములో దూరుట (19:24) లేక ఒకడు దోమలేకుండునట్లు వడియగట్టి ఒంటెను మింగుట (23:24) యొక్క అలంకారముతో పోల్చబడగలదై యుండును. క్రెయిగ్ ఎస్. కినర్ ఇలా వ్యాఖ్యానించాడు, "గ్రుడ్డివాడొకడు ఎలాగైతే మరొక గ్రుడ్డివానికి దారి చూపలేడో, ఒక వేళ చూపించుటకు ప్రయత్నించినా వారిద్దరు ఎలాగైతే గుంటలో పడిపోదురో (15:14; 23:16), అలాగే గ్రుడ్డివాడైన ఒక శస్త్రచికిత్స చేయు వైద్యుడు మరొకని కళ్లకు శస్త్రచికిత్స చేయవలెనని ఒకడు ఆశించడు."[6] ఒకని కంటిలో ఒక "నలుసు" లేదా ఒక "దూలము" ఉండుట యను విషయము చిన్నవైన మరియు పెద్దవైన పాపముల గూర్చిన అభిప్రాయమును అభివ్యక్తము చేయుటకు ఒక నానుడిగా చెప్పుకొనబడుచుండినదై యుండవచ్చును.[7]

**వచనము 5.** యేసు దిద్దుబాటుకు సంబంధించి రెండవ సోదాహరణ చిత్రీకరణమును ప్రయోగించాడు. పెద్ద పాపము చేసిన వానిని ఆయన **వేషధారి** (6:2, 5 పై గల

వ్యాఖ్యానము చూడు) అని పిలుచుచున్నాడు. వాడొక స్వనీతిమంతుడైన వ్యక్తియై యుండి ఇతరుల కంటే తానే ఉత్తమమైనవాడని ఎంచుకొనువాడై యున్నాడని ఆయన వర్ణించాడు. స్వనీతి యొక్క స్వభావము ఇతరులను ఖండించుచు, తనను తానే సమర్థించుకొనుటయై యున్నది (2 సమూయేలు 12:1-14 చూడు). ఈ వాస్తవము దృష్ట్యా, టాల్మడ్ ఈ క్రింది చక్కని సలహనిచ్చుచున్నది: "నీలోనే నీవు కళంకమును కలిగియుండి నీ పోరుగువాని మనుస్సును నొప్పించునట్లు ఎత్తిపోడుపు మాటలు పలుకవద్దు."[8]

అల్పమైన పాపములను అలక్ష్యము చేయవచ్చునని యేసు సెలవియ్యలేదు. దానికి బదులుగా, **మొదట నీ కంటిలో నున్న దూలమును తీసివేసికొనుము, అప్పుడు నీ సహోదరుని కంటిలోనున్న నలుసును తీసివేయుటకు నీకు తేటగా కనబడునని** ఆయన చెప్పాడు. వాడు తన సహోదరునికి తీర్పు తీర్చగలడనట్లు విమర్శించుచుండినవాడు "దూలము" తీసివేసికొనవలెననునది దీని అభిప్రాయము కాదు: దానికి బదులుగా, తన సహోదరుడు తన కంటిలో నున్న "నలుసును" తీసివేసుకొనగలుగునట్లు వానికి ఎలా సహయము చేయగలడో మరి ఎక్కువ స్పష్టముగా చూడగలుగునట్లు వాడు తన సొంత కంటిలోని దూలమును తీసివేసికొనవలెను. ఇటువంటి నలుసును తీసివేయుటకు అవసరమైయున్న బలము ఒకని స్వనీతిలో లేదు, కానీ దానికి బదులుగా వాడు తప్పిదము చేసిన తన సహోదరుని యెడల కలిగియున్న ప్రేమలోను, వానికి సహాయము చేయవలెనను యథార్థమైన ఆశలోను ఉన్నది (లూకా 17:3; రోమీయులకు 15:1; గలతీయులకు 6:1; 2 తిమోతికి 4:2; తీతుకు 1:13, 14).

**వచనము 6.** అన్యాయముగా తీర్పు తీర్చుట నుండి నిగ్రహముతో నిలబడుటకు ఆయన ఆజ్ఞను అనుసరించుచునే, వారు ఒక ముఖ్యమైన ప్రత్యేకతను ప్రదర్శించవలెనని ఆయన శిష్యులకు చెప్పాడు: **పరిశుద్ధమైనది కుక్కలకు పెట్టకుడి, మీ ముత్యములను పందుల యెదుట వేయకుడి, వేసినయెడల అవి యొకవేళ వాటిని కాళ్లతో త్రొక్కి, మీమీద పడి మిమ్మును చీల్చివేయును.**

ప్రాచీన కాలములో కుక్కలు ఇళ్లలో అరుదుగా పెంచుకొనబడుచుండినవి. అవి గుంపులు గుంపులుగా వీధుల్లో తిరుగాడుచు, రెచ్చగొట్టబడినట్లయితే లేకా అతిగా ఆకలిగొనియున్నట్లయితే మనుషుల మీదికే దాడిచేయుచుండినవి. తత్ఫలితంగా, యూదులు వాటి గూర్చి అత్యంత వ్యతిరేకార్థకమైన దృక్పథమును కలిగియుండిరి (కీర్తనలు 22:16; సామెతలు 26:11; లూకా 16:21; 2 పేతురు 2:22; ప్రకటన 22:15). అవతలి వ్యక్తిని అవమానపర్చుటకు "కుక్క" అని పిలుచుటను మించిన అతి గొప్ప అవమానము మరొకటి లేకుండినది (1 సమూయేలు 17:43; 2 సమూయేలు 16:9). యూదులు అన్యజనులను "కుక్కలు" అని పిలిచారు (15:26, 27) మరియు పౌలు ఈ పదమును అబద్ధ బోధకుల విషయంలో ప్రయోగించాడు (ఫిలిప్పీయులకు 3:2).

"పరిశుద్ధమైనది" (*to hagion*) అను పదజాలము, బల్యర్పణ గావింపబడిన మాంసమును సూచించుటకు సెప్టుజింట్‌లో అల్పమైన వ్యత్యాసములతో వాడబడినది (నిర్గమకాండము 29:33, 34; లేవీయకాండము 2:3; 22:10-16; సంఖ్యాకాండము 18:8-19). దేవునికి బల్యర్పణగా అర్పింపబడిన దానిలో నుండి ఒక మాంసము ముక్కను ఒక కుక్కకు పెట్టవలెనని ఆత్మాభిమానముగల యూదుడెవడును ఆలోచించడు.

సువర్తమానము, అనగా సువార్త, అది అతి గొప్పగా గౌరవింపబడవలెననియు, దానిని వినుటకైనను అంగీకరించని వారి యొద్ద వృథాచేయబడకూడదనియు కోరుచున్నదని యేసు ఘోషించుచుండెను.

పందులు, లేఖనములలో మరొక చోట కుక్కలకు ప్రక్కప్రక్కనే పేర్కొనబడినవి (2 పేతురు 2:22). అవి అపవిత్రములైన జంతువులై యుండెను (లేవీయకాండము 11:7; ద్వితీయోపదేశకాండము 14:8), కాబట్టి అవి ఎక్కువగా అన్యజనులు నివసించుచుండిన ప్రాంతములలో కనబడుచుండెను (8:30–32; లూకా 15:15, 16). గౌరవనీయుడైన యూదుడు పందిని కనీసము తాకనైనా తాకడు. రెండు నింబంధనల మధ్య కాలంలో, హెల్లేనీయుల వంశస్థుడై ఒక నియంతయై యుండిన, Antiochus యూదులు పందులను బల్యర్పణగావించునట్లును, వారు పంది మాంసము తినునట్లును వారిని బలమంతము చేయుటకు ప్రయత్నించాడు. ఏదిఏమైనా, యూదులు ఇటువంటి అసహ్యకరమైన పనులు చేయుట కంటె, దానికి బదులుగా మరణించుటకైనా ఇష్టపడుచుండిరని తెలిసికొన్నాడు.[9] యూదులు పందులను పెంచలేదు కాబట్టి, యూదులు నివసించుచుండిన ప్రదేశాల్లో ఉండిన పందులు విచ్చలవిడిగా తిరుగాడుచు, ఎదురైన ప్రతి మురికి పదార్థమును తింటూ శుద్ధీకారుల వలె పరుగులు తీయుచుండెను (కీర్తనలు 80:13).

ముత్యములను, ఎంతో గొప్ప విలువగలవాటిని, ఇంతటి పందుల వంటి పరమనీచమైన ప్రాణుల ముందర వేయుట ఒక అనూహ్యమైన విషయమై యుండును. పవిత్రమైన భోజనమును కుక్కలకు పెట్టుట వంటి ఇదివరకటి మనః కల్పనవలె, ఒక దానితో మరొకటి ఇవి ఎంత మాత్రమును పొసగనివై యున్నవి (సామెతలు 11:22 చూడు). పందులకు ముత్యములంటే ఏమిటో, వాటి విలువేమిటో ఏమీ తెలియదు కాబట్టి అవి సహజంగానే ముత్యములను వాటి కాళ్లతో త్రొక్కివేయును (హెబ్రీయులకు 10:29 చూడు). ముత్యములను పందులకు వేయుటకు ఒకడు ప్రయత్నించినట్లయితే, మృగములు సహితము కసితో వెనుదిరిగి ఆ మనిషిని చీల్చిచెండాడును.

మరొక పర్యాయము, "పరిశుద్ధమైనది," అను దానికి సంబంధించినంత వరకు "ముత్యములు" రాజ్యమును గూర్చిన సువార్తమానమునకు సరిపడిన సూచనయై యుండును (13:45, 46 చూడు)[10] కుక్కలు మరియు పందులు, ఈ సందర్భములో, భక్తిరహితమైనవారికి ప్రతినిధులై యుంటున్నవి, అన్యజనులకు కాదు. ఒకని జాతి లేదా జాతీయతతో నిమిత్తము లేకుండా, అవి సువార్త యెడల వైరభావముగల వారినందరిని సూచించును. వారు సువర్తమానమునకు అర్హులు కారు ఏలయనగా వారు పరిశుద్ధమైనదానిని ధిక్కరించుదురు (సామెతలు 9:7–9; 23:9 చూడు).

వారు ఒక పట్టములోనికి లేక ఒక ఇంటిలోనికి ప్రవేశించినప్పుడు, వారందించిన సువార్తమానము తృణీకరింపబడినట్లయితే, వారు "తమ పాద ధూళిని దులిపివేసి" ఆ పట్టణమును లేక ఇంటిని విడచి సువార్తమానమును విని అంగీకరించువారుండు మరొక పట్టణము లేక ఇంటికి వెళ్లవలెనని యేసు తన శిష్యులతో అటుతరువాత చెప్పాడు (10:13, 14). పౌలు అల్పవిశ్వాసులైన యూదుల నుండి వైరమును ఎదుర్కొనుచుండినపుడెల్లా, ఆయన వారి విషయమును వదిలిపెట్టి, సువార్తను అంగీకరించుటకు సంతోషముతో సమ్మతించుచుండిన అన్యజనుల యొద్దకు సువార్తమానమును తీసుకొని వెళ్లాడు (అపొస్తలుల

కార్యములు 13:45-52; 18:5-7; 28:23-28).

## ప్రార్థనలో పట్టుదల (7:7-11)

**7అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును. 8అడుగు ప్రతివాడును పొందును, వెదకువానికి దొరకును, తట్టువానికి తీయబడును. 9మీలో ఏ మనుష్యుడైనను తన కుమారుడు తన్ను రొట్టెను అడిగినయెడల వానికి రాతినిచ్చునా? 10-11చేపను అడిగినయెడల పామునిచ్చునా? మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి యీవుల నియ్య నెరిగి యుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవుల నిచ్చును.**

యేసు మరొక పర్యాయము ప్రార్థన గూర్చిన అంశము వైపు మళ్లాడు, ఇది అదివరకే ఆయన చేసిన కొండ మీద ప్రసంగములో చర్చింపబడినది (6:5-15). ప్రార్థించుటకు సంబంధించిన మూడు ఉద్బోధలతో ఆయన మొదలుపెట్టాడు: "అడుగుడి," "వెదకుడి," మరియు "తట్టుడి" (7:7, 8). విధివిహితమైన ఈ మాటల తదనంతరము, కుమారుడు "రొట్టె" మరియు "చేప" నడిగిన దానికి తండ్రి చూపిన ప్రతిస్పందనకు సంబంధించిన రెండు సోదాహరణ చిత్రీకరణములు కలవు (7:9, 10). ప్రార్థన గూర్చిన ఆయన వ్యాఖ్యానములు "అల్పమైన దాని నుండి అధికమైన దానికి" అను ధోరణిలో సాగుచుండు తర్కముతో ("అంత కంటే ... మంచి") ముగియుచున్నది.

**వచనములు 7, 8.** మూడు విభిన్నమైన ఉద్బోధలతో, యేసు ప్రార్థన యొక్క ప్రాముఖ్యతను ఉద్ఘాటించి చెప్పాడు. **అడుగుడి** అను పదము ప్రార్థనకు ఒక సామాన్య రిఫరెనుసైయున్నది (21:22; మార్కు 11:24; యోహాను 14:13, 14; 15:7, 16; 16:23, 24 చూడు), అయితే **వెదకుడి మరియు తట్టుడి** అను పదములు రూపకాలంకారముగా ప్రయోగింపబడినవి (ప్రకటన 3:20 చూడు).[11] 7వ వచనంలో ఉపయోగింపబడిన వర్తమాన విధివిహితమైన క్రియాపదములు ఎడతెరపిలేకుండా కొనసాగుచుండు చర్యను సూచించుచున్నవి. JNTలో "అడుగుచునే యుండుము, వెదకుచునే యుండుము, తట్టుచునే యుండుము" అని వ్రాయబడి యున్నది.

ప్రార్థనలో ఉండవలసిన పట్టుదల గూర్చి యేసు చెప్పిన రెండు ఉపమానములను లూకా గ్రంథస్థం చేసాడు, అవి "వెదకుడి" మరియు "తట్టుడి" అను ఈ ప్రాధానాంశముతో సంబంధము కలిగియున్నవి. లూకా 18:1-8లో, అన్యాయస్థుడైన న్యాయాధిపతి నుండి ఆమెకు న్యాయము చేకూర్చబడవలెనని పట్టువిడువక వెదకుచుండిన ఒక విధవరాలి గూర్చి చిత్రీకరింపబడియున్నది, చివరకు ఆమె పట్టువిడువనందున ఫలించినది. లూకా 11:5-8లో, అతని యొద్దకు అనుకొనని విధంగా వచ్చిన ఆతిథి నిమిత్తము కొన్ని రొట్టెలను అప్పుగా తీసికొనుటకు ఒకడు తన స్నేహితుని ఇంటికి మధ్యరాత్రివేళ వచ్చిన ఉదంతము కలదు. వాని పట్టువిడువకుండుటనుబట్టి, వాని స్నేహితుడు పడకలో నుండి లేచి వచ్చి వానికి అవసరమై యుండిన రొట్టెలనిచ్చి పంపాడు.

**అడుగు ప్రతివాడును పొందును, వెదుకువానికి దొరకును, తట్టువానికి తీయబడునని** యేసు వాగ్దానమిచ్చాడు. దేవుడు మన ప్రార్థన మనవులను అయిష్టపడడు, సరికదా

ఆయన వాటిని అలక్ష్యము కూడ చేయడు. ఆయన తలుపును ఎలప్పుడు తెరచియుంచును గనుక మన అవసరతలను మనకు అనుగ్రహించకుండా మనలను ఎన్నడును దూరముగా పంపివేయడు. దేవుడు, "ఎవనిని గద్దింపక అందరికిని ధారాళముగా దయచేయువాడని" యాకోబు చెప్పుచున్నాడు (యాకోబు 1:5).

**వచనములు 9, 10.** ఇంకా రెండు సోదహరణ చిత్రీకరణములు తెలియజెప్పబడుచున్నవి (అవి ఉల్లేఖనముల వలె ఉదహరించి చెప్పబడినవి), ఇహలోక తండ్రులు వారి పిల్లలు చేయు మనవులకు ఎలా ప్రతిస్పందిస్తారో అవి చూపించుచున్నవి. మొదటిది, **మీలో ఏ మనుషుడైనను, తన కుమారుడు తన్ను రొట్టెను అడిగినయెడల, వానికి రాతినిచ్చునా?** యని యేసు ప్రశ్నించాడు. "ఒక్కడునూ లేడు!" అనునది ఈ ప్రశ్నకు స్వయం విదితమై యున్న సమాధానమై యున్నది. ఒక "రొట్టెకును" మరియు ఒక "రాతికిని" మధ్య గల సంబంధము, వాటి గుండ్రని ఆకారమైయుండును. యేసు అరణ్యములో ఉన్నప్పుడు రాళ్లు రొట్టెలగునట్లు ఆజ్ఞాపించవలసినదని అపవాది ఆయనను అడిగిన సందర్భములో, ఆయన ఎదుర్కొనిన మొదటి శోధన నుండి కూడ ఈ పోలిక సూచింపబడుచున్నది (4:3).

యేసు, పునఃరుక్తము చేయగల కళను ప్రదర్శించుచు, **లేక, చేపను అడిగిన యెడల, పామునిచ్చునా?** యని ప్రశ్నించాడు. మరొక పర్యాయము, ప్రతిధ్వనింపుతో కూడిన "లేదు!" అనునదే సమాధానమై యున్నది. ఈ వాక్యభాగమును అడపాదడపా చదువుట, ఒక విషపూరితమైన పాము ఒక పిల్లవానికి సంభవనీయముగా హానికలిగించగల లేక వానిని చంపివేయగల సందర్భమును మనస్సుకు తెచ్చును – ఇది సరైనదై కూడ ఉండవచ్చును. ఎంతైనా, *ophis* అను మాట క్రొత్త నిబంధనలో ఒక మాదిరిగా పాములను సూచించుచున్నది (మార్కు 16:18; 1 కొరింథీయులకు 10:9). ఏదిఏమైనా, ఇచ్చటి రిఫరెన్సు గలిలయ సముద్రములో దొరుకుచుండిన పాము-చేపను గూర్చినదై యుండుట మరొక సాధ్యతయై యున్నది.[12] పాము వంటి చేపలను పాములుగా పరిగణించుట అనేక ప్రాచీన సంస్కృతులలో ఒక సామాన్యమైన సంగతై యుండినదని ఎడ్విన్ ఫర్మేజ్ తర్కించాడు.[13] ఈ సందర్భములో, "పాము" అనునది సామాన్యముగా పైన పేర్కొనబడిన రాతివంటిదై యుండును-అనగా ఆహారముగా సేవించుటకు వీలులేనిది. లేవీయకాండము 11:9-12 ప్రకారము, రెక్కలు మరియు పొలుసులు కలిగియుండని ఏ చేపనైనను యూదులు తినుట నిషేధించబడినది.

రొట్టె మరియు చేప గలిలయ సముద్రమునకు చుట్టుప్రక్కల జనసాంద్రత అధికంగా ఉండిన ప్రదేశాల్లో అత్యంత సామాన్యముగా సేవింపబడుచుండిన ఆహరపదార్థములకు ప్రతినిధులై యున్నవి (14:15-21; 15:32-38). "లేక, గుడ్డునడగితే, తేలునిచ్చునా?" యని కూడ యేసు చెప్పాడని లూకా వ్రాసిన సువార్త అదనంగా చెప్పుచున్నది (లూకా 11:11). తేళ్లు అపవిత్రములైన "నేల మీద ప్రాకు జీవరాసుల" వర్గమునకు చెందినవై యుండినవి (లేవీయకాండము 11:29-31) , గనుక ఈ హేతువు ఆధారంగా మాత్రమే అవి ఆహారముగా సేవింపబడకూడదని నిషేధింపబడినది. కొన్ని విధములైన తేళ్లు గట్టి పైపొర కలిగియుండి, అవి ముడుచుకొని నిద్రపోతున్నప్పుడు గుడ్ల సారూప్యముగలవైయుండును ఎవరైనా గాని ఇటువంటి తేలును ఒక గుడ్డుగా ఎంచి తినుట కొరకు దానిని తీసికొన్నట్లయితే, వాడు సహజంగానే తీవ్రముగా గాయపడును.

**వచనము 11.** యేసు తెలియజెప్పిన ముగింపు అభిప్రాయము సుస్పష్టమైనదియు,

శక్తివంతమైనదియునై యున్నది: **మీరు, చెడ్డవారై యుండియు, మీ పిల్లలకు మంచి యీవుల నియ్య నెరిగియుండగా, పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంత కంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవుల నిచ్చును!** దేవుడు తన ప్రజలకు ఎల్లప్పుడు ధారాళముగా అనుగ్రహించునని రుజువుపర్చుటకు యేసు “అల్పమైన దాని నుండి గొప్పదైన దానికి” అను తర్కమును ప్రయుక్తపరచాడు. ఇలా చేయడం ద్వారా ఆయన తన శ్రోతలు “చెడ్డవారని” (*ponēros*) సూచించాడు. కొండ మీద ప్రసంగములో ఎనిమిది పర్యాయములు అగుపించుచున్న (5:11, 37, 39, 45; 6:13, 23; 7:17, 18) ఈ పదము, ఇచ్చట దేవునితో, పరిపూర్ణముగా “మంచివాడైయున్న” వానితో (19:17; 5:48 చూడు) పోల్చబడుచు ప్రయోగింపబడినది. దేవునితో పోల్చబడినప్పుడు, ఉత్తమోత్తమమైన తలిదండ్రులు సహితము చెడ్డవారై యున్నట్లు చూపింపబడుచున్నది.[14]

తమ పిల్లలను ప్రేమించు ఏ తల్లియైనను తండ్రియైనను వారి పిల్లలు రొట్టె లేదా చేప కొరకు అడిగినప్పుడు, వారికి ఒక రాతిని లేదా ఒక పామును ఇచ్చునంత క్రూరంగా ప్రవర్తించరు. మంచి తలిదండ్రులు వారి పిల్లలకు ఉత్తమమైన వాటిని మాత్రమే ఇచ్చుటకు ఉవ్విళ్లూరుచుందురు. మానవ తలిదండ్రులు వారి పిల్లల అవసరతలను తీర్చగోరుచున్నారు కాబట్టి, మన పరలోకపు తండ్రి మరి నిశ్చయముగా ఆయన పిల్లల అవసరములన్నిటిని తీర్చునని మనకు స్పష్టముగా తెలియుచున్నది (ఫిలిప్పీయులకు 4:19; యాకోబు 1:17; 1 పేతురు 3:12; 5:7; 1 యోహాను 5:14, 15). ఆయన తన పిల్లలను ఆశీర్వదించవలెనని దేవుడు ఆశించుచున్నాడు. విశ్వాసముతో మరియు ఆయన చిత్తప్రకారము ఆయనను అడుగువారికి ఆయన ఎంతో మేలు చేయగోరుచున్నాడు గనుక ఈ విషయముల గూర్చి లేఖనములు ఎటువంటి పరిమితిని విధించుట లేదు.

ఆయన వర్ణించుచున్న మానవ సోదాహరణ చిత్రీకరణములు (రొట్టె మరియు చేప) ఐహికమైనవైనందున, “మంచి యీవులు” అను పదజాలమును ఐహికముగానే అనువదించి అర్థంచేసుకొనుట సులభము. ఏదిఏమైనా, దేవుడు తన పిల్లలకు ఐహిక అవసరములను తీర్చుచున్న విధంగా (6:33), ఆయన ముఖ్యంగా వారి ఆధ్యాత్మిక అవసరములను సమకూర్చును. “మంచి యీవులను” అనుటకు బదులుగా, లూకా 11:13లో “పరిశుద్ధాత్మను” అని వ్రాయబడి యున్నది. శిష్యులు అడుగుట, వెదుకుట, మరియు తట్టుట, నిర్దిష్టముగా వారు ఈ ప్రసంగములోని సవాళ్లతో కూడిన ఉపదేశములను వారి జీవితాల్లో నెరవేర్చుటకు వారికి అవసరమైయుండు ఆధ్యాత్మిక శక్తితో సంబంధము గలదై యున్నది (రోమీయులకు 8వ అధ్యాయము చూడు).

## సారాంశము: సువర్ణ సూత్రము (7:12)

**12కావున, మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో, ఆలాగుననే, మీరును వారికి చేయుడి, ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల ఉపదేశమునై యున్నది.**

**వచనము 12.** యేసు అదివరకు ఉపదేశించిన దానికి ఒక విధమైన సారాంశముగా, ఇతరులతో వ్యవహరించుట గూర్చి ఆయన ఒక మార్గనిర్దేశనము నిచ్చాడు, ఇది “సువర్ణ సూత్రముగా” సుప్రసిద్ధమై యున్నది. ప్రాథమిక సూత్రము, మానవులకు ఎప్పుడైనా

ఇవ్వబడిన వాటిలో మహోన్నతమైన నైతిక నియమమై యున్నదని అవిశ్వాసులైనవారి చేత సహితము అంగీకరింపబడుచున్నది. ఆసియా, గ్రీకు, రోమా, మరియు యూదీయ దేశ నేపథ్యముగల ఋషులు మరియు తత్వవేత్తలు ఇటువంటి మందలింపులను మానవులకు ఇచ్చారు. ఏదిఏమైనా, వారు ప్రకటించిన నియమములలో అత్యధిక శాతం వ్యతిరేకార్థముతో చెప్పబడినవి.

ఆయా తత్వవేత్తల వాంగ్మూలములు ఇలా ఉన్నవి: "ఇతరులు నీకు ఏమి చేయకూడదని నీవాశించుదువో, వాటినే నీవు ఇతరులకు చేయవద్దని" కన్‌ఫ్యూషియస్, చైనా దేశ తత్వవేత్త చెప్పాడు.[15] "నీవు ఇతరుల హస్తములలో బాధపడునప్పుడు నీకు కోపము పుట్టించునదేదైనను, దానినే నీవు ఇతరులకు చేయవద్దని" ఇసోక్రేట్స్, గ్రీకు తత్వవేత్త మందలించాడు.[16] అరిస్టాటిల్, గ్రీకు తత్వవేత్త, స్నేహితుల యెడల ఎలా ప్రవర్తించుట మంచిదని ప్రశ్నించినప్పుడు, "వారు మన యెడల ఎలా ప్రవర్తించాలని కోరుదుమో, అలాగే" అని ఆయన సమాధానమిచ్చాడు.[17] హిల్లేల్, యూదుల మతోపదేశకుడు, "నీకు అసహ్యము పుట్టించు విషయమును, నీ పొరుగువాని యెడల చేయవద్దని" ఒక అన్యమతావలంబికుడైన వానికి సూచించాడని చెప్పుకొనబడుచున్నది.[18] "నీవు ద్వేషించుదానిని, మరెవరికినీ చేయవద్దని" అప్రమాణిక గ్రంథంలోని టోబిత్ పుస్తకము సలహ ఇచ్చుచున్నది.[19] ఇంకా, "నీ సొంత అనుభూతుల ఆధారంగా, నీ పొరుగువాని అనుభూతులను వివేచించి తెలిసికొనుము, మరియు ప్రతి విషయములోను ఆలోచనాపూర్ణుడవై యుండుమని" సిరాక్ గ్రంథం చెప్పుచున్నది.[20] "చెడు విషయాలు నీ మీదికి రాకూడదు, కానీ ప్రతి ఆశీర్వాదము నీకే దక్కాలని నీవు ఎంతగా కోరుకొనుచుందువో, ఇదే విషయాన్ని నీవు నీ చేతి క్రింద నుండు వారి యెడల అభ్యసించినట్లయితే (అది నీ యెడల వివేకవంతమైన విషయమై యుండును)" అని అరిస్టియస్ వ్రాసిన ఉత్తరము ప్రకటించుచున్నది.[21]

యేసు చేసిన మందలింపు నిర్మాణాత్మకముగా వ్యక్తము చేయబడినది, గనుక దాని చర్యలు ఏదైన ఒక వర్గమునకు (ఉదాహరణ ఒకని స్నేహితులు) పరిమితమై యుండలేదు: **ఇతరులు నీ యెడల ఎలా ప్రవర్తింపవలెనని నీవు కోరుదువో, అదే విధముగా నీవును ఇతరుల యెడల ప్రవర్తింపవలెను.**[22] ఇదే అభిప్రాయమును యేసు వ్యతిరేక్థాకముగా తెలియజెప్పియుండినట్లయితే, "ఏమియు చేయకుండానే సువర్ణ సూత్రము నెరవేర్చబడగలదు. దాని నిర్మాణాత్మకమైన రూపురేఖలు మనము ఇతరుల పక్షముగా చర్యలను చేపట్టునట్లుగా మనలను కదలించుచున్నవి; ఇతరులు మనకు చేసినట్లయితే సంతోషముతో సంతృప్తిచెందుదుమని మనము భావించు విషయములన్నిటిని మనము వారి యెడల చేయవలెనని మనకు పిలుపునిచ్చుచున్నది."[23] జాక్ పి. లూయిస్ ఇలా చెప్పుచున్నాడు, "ఈ నియమము యొక్క నిశ్చయాత్మకమైన రూపము ఒకడు [మంచి] సమరయుడు చేపట్టిన కార్యకలాపములను చేయ బూనుకొనునట్లు వానిని బంధించివేయును (లూకా 10:30–37)."[24]

యేసు సువర్ణ సూత్రమును నివేదించినప్పుడు, **ధర్మశాస్త్రమును ప్రవక్తల** ఉపదేశము యొక్క సారాంశమును తెలియజెప్పుచున్నట్టు ఆయన ఒక క్రొత్త నియమమును ఇచ్చుచుండలేదు. అటురువాత ఆయన "నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను" (ద్వితీయోపదేశకాండము 6:5) మరియు "నిన్ను వలె నీ పొరుగు వానిని ప్రేమింపవలెను"

(లేవీయకాండము 19:18) అను పాత నిబంధనలోని ఆజ్ఞలకు సంబంధించిన ఇటువంటిదే ఒక ప్రకటన చేసాడు. "ఈ రెండు ఆజ్ఞలు ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును ఆధారమై యున్నవి" అని ఆయన సెలవిచ్చాడు (22:40). యూదా మత బోధకుడైన హిల్లేల్ సువర్ణ సూత్రము గూర్చి తన వ్యతిరేకార్థక అనువాదమును చెప్పిన తదుపరి, "ధర్మశాస్త్రమంతా ఇంతే, మిగిలినదంతా వ్యాఖ్యానమే" అని కూడా ఆయన చెప్పాడు.[25] యేసు ఉపదేశించిన దాని ప్రకారమైన సువర్ణ సూత్రము "నిన్ను వలె నీ పొరుగు వానిని ప్రేమింపవలెనను" ఆజ్ఞను పోలినదై యున్నదని గమనించవలెను (రోమీయులకు 13:8–10; గలతీయులకు 5:14 చూడు).

వచనము 12, **కావున** అను మాటలతో ప్రవేశమగుచున్నందున, కొండ మీద ప్రసంగమునకు అదొక సారాంశముగా ప్రయోజనకరమైనదై యుండవచ్చును. ధర్మశాస్త్రము మరియు యేసు ఉపదేశములు సువర్ణ సూత్రమను కటకము గుండా దృష్టింపబడవలెను. "ధర్మశాస్త్రమును ప్రవక్తల ఉపదేశమును" అను పదజాలము 5:17లోని "ధర్మశాస్త్రమునైనను ప్రవక్తల వచనములనైనను" అను అదివరకటి పదజాలమును సమానాంతరము చేయుచున్నది. ఈ రిఫరెన్సులు కొండ మీద ప్రసంగము యొక్క ప్రధాన భాగమునకు (5:17–7:12) కుండలీకరణములుగా ప్రయోజనకరమౌను.

## చిట్టచివరి ప్రోత్సాహక ఉద్బోధలు (7:13–27)

ఈ ప్రసంగము ముగింపులో, వారు ఆయన ఉపదేశములకు లోబడవలెనని యేసు తన శిష్యులకు ఉద్బోధించాడు. వారు అనివార్యముగా ఎంపికచేసికొనవలసి యుండు తారతమ్యముల పరంపరలను ఆయన వారి ముందుంచాడు: రెండు వెవ్వేరు ద్వారములు (7:13, 14), రెండు రకములైన చెట్లు (7:15–20), రెండు విధములైన వెంబడించువారు (7:21–23), మరియు రెండు రకములైన నిర్మాణకులు (7:24–27). ఆర్. టి. ఫ్రాన్స్ ఇలా వ్రాయుచున్నాడు, "పైన పేర్కొనబడిన ప్రతి ఒకటి అసలైన దానికిని అసలైనది కానిదానికిని మధ్య గల తారతమ్యమును మన ఎదుటనుంచుచున్నది, గనుక ఈ యథార్థత శిష్యుని బహిరంగ ఒప్పుకోలులో కాదు, కానీ వాని ఆచరణాత్మకమైన ప్రదర్శనలో కనుబడును."[26] సరైన ప్రతిస్పందన ఉద్ఘాటించి ఉద్బోధింపబడుచున్నది. "చేయు" అని సాధారణంగా అనువదింపబడు గ్రీకు పదము *poieō*, ఈ విభాగములో విధేయతకు సంబంధించి తొమ్మిది పర్యాయములు అగుపించును.

### రెండు వెవ్వేరు ద్వారములు (7:13, 14)

**13–14 ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునైయున్నది, దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది, దాని కనుగొనువారు కొందరే.**

**వచనములు 13–14.** వారు ఇరుకు ద్వారమున ప్రవేశింపవలెనని యేసు ఆయనను వెంబడించుచుండిన వారిని విన్నవించుకొన్నాడు. **ఇరుకు** అని అర్థమిచ్చుటకు ఇచ్చట వాడబడిన గ్రీకు పదము (*stenos*) "అతి కష్టమును" అనగా, ఒకరు "ఒక చిన్న కన్నం

గుండా అదుమబడుచు నొక్కబడుచున్నట్లుండు" పరిస్థితిని సూచించుచున్నది. మూయబడిన తలుపు గూర్చి ఆయన చేసిన చర్చలో, "ఇరుకు ద్వారమున ప్రవేశింప పోరాడుడి; అనేకులు ప్రవేశింప జూతురు గాని వారివలన కాదని మీతో చెప్పుచున్నానని" యేసు సెలవిచ్చాడు (13:24). "పోరాడుడి" అను అర్థమిచ్చు గ్రీకు పదము (*agōnizomai*) "గింజుకొను"/ "మిక్కిలి బాధపడు" అని అర్థమిచ్చు "agonize" మరియు "క్షోభ"/"వేదన" అని అర్థమిచ్చు "anguish" అను పదములకు మూలమై యున్నది. పరలోకములో ప్రవేశించుటకు ఎంతో ప్రయాస అవసరమై యుండుననునది దాని ధ్వనింపై యున్నది (5:20; 19:24 చూడు).

**ప్రవేశించుడి** అను మాటకు ఇచ్చట వాడబడిన పదము (*eiselthate*) నిర్ణీత కాలముకాని విధివాచక మానసికావస్థను తెలియజేయుచు, ఒక నిర్దిష్టమైన చర్యను సాధికారముతో కోరుచున్నది; అదొక ఆజ్ఞయై యున్నది. యేసు ఈ మాటలు పలికినప్పుడు, అవి ఒక హెచ్చరికనిచ్చుటకు ఉద్దేశింపబడినవి కావు, కానీ ఒక మందలింపు లేక ఒక ఆహ్వానమునిచ్చినవి. ఆయన యెద్దకు రావలెనని ఆశించుచుండిన వారినందరిని యేసు ఆనందముతో ఆహ్వానించుచుండెను.

ఇరుకు ద్వారమున ప్రవేశించువారు, వారు పయనించు బాట కూడ ఇరుకుగానే ఉండును. **"ఇరుకునై యున్నదని"** అనువదింపబడిన గ్రీకు క్రియాపదము (*thlibō*), "అణుచు," "నిర్బంధించు," "బాధించు" అని కూడ అర్థమిచ్చును. యేసు శిష్యులు నడచివెళ్లు బాట కష్టములు, పోరాటములు, మరియు హింసలతో కూడ నిండియుండును. పాలస్తీనాలోని ప్రాచీన కాలము నాటి బాటలు యేసు యొక్క మనఃకల్పనకు నేపథ్యముగా పనికివచ్చుచున్నవి. రాబర్ట్ హెచ్. గుండ్రి గుర్తించిన విషయం ఇలా వున్నది, "తారతమ్యమునుబట్టి బల్లపరుపుగా నుండిన దేశములో ప్రయాణం చేయుటకు వెడల్పైన బాటలుండినవి. కానీ పర్వత శ్రేణులుండిన విశాలమైన ప్రదేశములో ఇరుకైన బాటలుండినవి మరియు ప్రయాణం చేయుటకు అవి కష్టముగా నుండినవి."[27]

యేసు మనఃకల్పనలో, ఇరుకు ద్వారము మరియు ఇరుకు మార్గము ఒకదానితో మరొకటి ఎలా సంబంధము కలిగియుండినవి? ఫ్రాన్స్ ఇలా ప్రశ్నించాడు, " 'ఇరుకు ద్వారము' ప్రారంభంలో ఉన్నదా లేక 'కష్టమైన మార్గం' ముగింపులోనా? లేక రెండు పోలికలు ఒకే చోట కలియుచున్నట్లు, బహుశా కఠినమైన బాట ద్వారము గుండా వెళ్లుచుండు మార్గము వలె చూడబడవలసినదై యున్నదా?"[28] ఈ ప్రశ్నలకు దొరుకు సమాధానములతో నిమిత్తములేకుండా, యేసు తెలియజేప్పుచున్న విషయం సుస్పష్టముగా నున్నది. ప్రత్యామ్నాయములై యుండిన రెండు జీవిత మార్గములు, విచిత్రముగా విభిన్నమైన గమ్యములుగలవై యుండిన రెండు జీవిత మార్గములలో ప్రజలు ఏదో ఒక దానిని ఎంపిక చేసుకొనవలెనని ఆయన కోరాడు: నిత్య **జీవము** మరియు నిత్య నాశనము.[29] రెండు మార్గములలో నుండి, మనము ఏదైన ఒక దానిలో మాత్రమే పయనించవచ్చును. ఒక మార్గమును ఎన్నుకొన్నామంటే, రెండవ మార్గమును తృణీకరించినట్లే. ఈ రెండు మార్గములు కూడ రెండు వేర్వేరు స్థలాల్లో ఆరంభమగును, అవి ఒక దానితో నొకటి సంధించుకొనవు, మరియు ఒక దాని నుండి రెండవ దానికి దగ్గరి దారులు లేవు. మనము ఏ మార్గములో వెళ్లగోరుదుమో, ఏ గమ్యమును చేరగోరుదుమో, ఈ లోక జీవితములోనే తీర్మానించుకొనవలెను. తీర్మానము తీసికొనుటకు వెనుకాడుచున్నామంటే, అది ఇరుకు

మార్గములో వెళ్లుటకు తీర్మానించుకొనబడిన తీర్మానము కాదని అర్థము.

వారు ఇరుకు మార్గమున ప్రవేశింపవలెనని యేసు ఆయన శ్రోతలను ప్రేరేపించాడు ఏలయనగా దీనికి ప్రత్యామ్నాయమైన విశాల ద్వారము విషాదాంతమైన నాశనమునకు దారితీయును: **నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునై యున్నది.** "విశాలమైనది" అని అర్థమిచ్చుటకు వాడబడిన గ్రీకు పదము (*euruchōros*) "విస్తీర్ణమైన" అని అర్థమునిచ్చును. ఆ మార్గమునకు ఎటువంటి అవసరములైనను లేక నిర్బంధములైనను లేవు. అది నిబద్ధతను, నీతులను, లేక ఆధ్యాత్మిక పరిపక్వతను కోరదు; కానీ దాని అంతిమ ప్రతి ఫలము మరణము మరియు నాశనమే (రోమీయులకు 6:23). అది సువిశాలమైనదై, ఆహ్లాదంగా ఆహ్వానించుచున్నదై యుండును, గనుక అది ప్రాణాంతకమైన మార్గమైనప్పటికిని, **అనేకులు** ఆ మార్గములో పయనించుటకే ఎంచుకొందురు. దేవుని ప్రజలు దాదాపుగా ఎల్లప్పుడు అల్పసంఖ్యాకులుగానే యుంటున్నారు (ఆదికాండము 6:1–22 చూడు).

ఈ వచనములకు సంబంధించినంత వరకు, ఈ "రెండు ద్వారముల" సాదృశ్యము సర్వసాధారణంగా ప్రయోగింపబడిన ఒక రూపకాలంకార సాధనమై యుండి, పాత నిబంధన, రెండు నిబంధన మధ్య కాలం నాటి సాహిత్యము, మృత సముద్ర కాగితపు చుట్టలు, యూదా మత బోధకుల సాహిత్యము, మరియు అపొస్తలత్వ పితామహులలో నుండి ఉదాహరణములను ఎత్తి చెప్పుచుండినదని డొనాల్డ్ ఏ. హేగ్నర్ సూచించుచున్నాడు.[30] కేవలము ఒక్క పాత నిబంధనలోనే, "దీవెన" మరియు "శాపము" (ద్వితీయోపదేశకాండము 11:26), "జీవము మరియు మేలు" మరియు "మరణము మరియు కీడు" (ద్వితీయోపదేశకాండము 30:15), "యెహోవా" మరియు "నది అద్దరిని మీ పితరులు సేవించిన దేవతలు" (యెహోషువ 24:14, 15), నీతిమంతము మరియు దుష్టత్వము (కీర్తనలు 1:1–6), మరియు "జీవమార్గము" మరియు "మరణ మార్గము"నకు (యిర్మీయా 21:8) మధ్య చేసికొనవలసి యుండిన గంభీరమైన ఎంపికను దేవుని ప్రజలు ఎదుర్కొన్నారు.

### రెండు రకములైన చెట్లు మరియు అబద్ధ ప్రవక్తల ఫలము (7:15–20)

**15అబద్ధ ప్రవక్తలనుగూర్చి జాగ్రత్తపడుడి. వారు గొఱ్ఱెల చర్మములు వేసికొని మీయొద్దకు వత్తురు కాని లోపల వారు క్రూరమైన తోడేళ్లు. 16వారి ఫలములవలన మీరు వారిని తెలిసికొందురు. ముండ్లపొదలలో ద్రాక్ష పండ్లనైనను, పల్లేరుచెట్లను అంజూరపు పండ్లనైనను కోయుదురా? 17ఆలాగుననే ప్రతి మంచి చెట్టు మంచి ఫలములు ఫలించును, పనికిమాలిన చెట్టు. కానిఫలములు ఫలించును. 18మంచి చెట్టు కానిఫలములు ఫలింపనేరదు, పనికిమాలిన చెట్టు మంచి ఫలములు ఫలింపనేరదు. 19మంచి ఫలములు ఫలింపని ప్రతిచెట్టు నరకబడి అగ్నిలో వేయబడును. 20కాబట్టి మీరు వారి ఫలములవలన వారిని తెలిసికొందురు.**

**వచనము 15.** రెండు ద్వారముల గూర్చి చెప్పిన తరువాత యేసు రెండు రకములైన చెట్టు గూర్చి – మంచి చెట్టు మరియు పనికిమాలిన చెట్టు గూర్చి చెప్పుటకు మొదలుపెట్టారు.

ఆయన **అబద్ధ ప్రవక్తల** గూర్చి హెచ్చరించుచుండెను. రానైయుండిన "అబద్ధ ప్రవక్తలు" ప్రజలు "విశాల మార్గము"లో వెళ్లునట్లు వారిని ప్రలోభపెట్టుదురనునది దీనికిని, దీనికి మునుపటి మందలింపునకునుగల స్పష్టమైన సంబంధమై యున్నది.

అబద్ధ ప్రవక్తల గూర్చిన హెచ్చరిక ఇశ్రాయేలు జనాంగము వ్యవస్థాపింపబడినంత ప్రాచీనమైనదైయున్నది. "ప్రవక్త యెహోవా నామమున చెప్పినప్పుడు, ఆ మాట జరుగకపోయిన యెడలను ఎన్నడును నెరవేరకపోయిన యెడలను, అది యెహోవా చెప్పిన మాట కాదు. ఆ ప్రవక్త అహంకారము చేతనే దాని చెప్పెను; గనుక దానికి భయపడవద్దని" ఆయన ప్రజలతో చెప్పినప్పుడు, మోషే ఇశ్రాయేలు ప్రజలకు అబద్ధ ప్రవక్తను గుర్తుపట్టుట గూర్చి తెలియజెప్పాడు (ద్వితీయోపదేశకాండము 18:22). అనగా, "నేనొక ప్రవక్తనని" చెప్పుకొనువాడు చెప్పిన జోస్యము ప్రకారము నెరవేరనట్లయితే, అతడు లేక ఆమే అబద్ధ ప్రవక్తయని మరొక మాటలో చెప్పుకొనవచ్చును.

యేసు చెప్పుచుండిన అబద్ధ ప్రవక్తలెవరై యుండిరి? యేసు యూదీయ శ్రోతలను ఉద్దేశించి సంబోధించుచుండెను, గనుక ఎవరికి వారే "నేనే మెస్సీయానని" చెప్పుకొనిన అబద్ధ ప్రవక్తలు ఆయన మనస్సులో ఉండియుండవచ్చును. అటుతరువాత, "అనేకులైన అబద్ధ ప్రవక్తలు వచ్చి పలువురిని మోసపరచెదరు ... . అబద్ధపు క్రీస్తులును అబద్ధపు ప్రవక్తలును వచ్చి, సాధ్యమైతే, ఏర్పరచబడిన వారిని సహితము మోసపరచుటకై, గొప్ప సూచక క్రియలను మహత్కార్యములను కనబరచుదురని" ఆయన తన అపొస్తలులతో చెప్పాడు (24:11, 24). ఇటువంటి మెస్సీయ సంబంధిత కపట వేషధారులు దాదాపు మొదటి శతాబ్దములోనే బయల్దేరారు, రోమా ప్రభుత్వమును కూలద్రోయునట్లు కూడ వారు సైన్యములను పోగుచేసుకొనుచుండిరి. ఏదిఏమైనా, వారి సైన్య సమూహములు ఓడింపబడినప్పుడు, ఈ నాయకులు దేవుని చేత పిలువబడలేదు సరికదా, వారు ఆయనచేత అభిషేకము కూడ చేయబడలేదనునది రుజువయ్యింది. ఇటువంటి కపట వేషధారులను అపొస్తలుల కార్యముల పుస్తకము పేర్కొనుచున్నది: థూదా, గలిలయవాడైన యూదా, మరియు ఐగుప్తీయుడు (పేరు పేర్కొనబడలేదు) (అపొస్తలుల కార్యములు 5:36, 37; 21:38).[31]

ఆయన శిష్యులు రాజ్యము (సంఘము) కొరకు ఎదురుచూడవలెనని యేసు తన శిష్యులకు చెప్పుచుండెను, గనుక క్రైస్తవ్యములోని అబద్ధ బోధకుల వలన కలుగు అపాయముల గూర్చి కూడ ఆయన ముందుగానే తెలియజెప్పుచుండి యుండవచ్చును. సంఘము స్థాపింపబడిన తొలి రోజుల్లో, క్రొత్త నిబంధన ప్రామాణిక గ్రంథము పూర్తిచేయబడక మునుపు, సంఘ సమూహముల వ్యవస్థాపించుటకును వాటిని అభివృద్ధిచేయుటకును ప్రవచన వరము అత్యావశ్యకమైన అంశమై యుండినది (1 కొరింథీయులకు 12:10, 28; 14:1–40). సంఘము, "అపొస్తలులను ప్రవక్తలును వేసిన పునాది మీద" కట్టబడినది (ఎఫెసీయులకు 2:20), అనగా, క్రీస్తు మరియు ఆయన చిత్తము గూర్చి వారు ప్రేరేపింపబడి వారికి బోధింపబడిన ఉపదేశముల మీద అది కట్టబడినది. యేసు క్రీస్తు విశ్వసనీయులను, ప్రేరేపింపబడినవారునైన అపొస్తలులను మరియు ప్రవక్తలను తన కార్యభారమును నిర్వర్తించుటకు పంపించాడు. ఏదిఏమైనా, అంతరాయం కలిగించుచున్నట్లుగా మధ్యలో వారి సొంత అభిప్రాయములను మరియు అబద్ధ ప్రవచనములను దూర్చుచు వారిని

అనుకరించుటకు అబద్ధ బోధకులు ప్రయత్నించారు. కాబట్టి, అందించబడిన సందేశములు బహు జాగ్రత్తతో మదింపు చేయబడవలసి యుండినవి (1 కొరింథీయులకు 12:10). అందుచేతనే పౌలు, "ఆత్మను ఆర్పకుడి; ప్రవచించుటను నిర్లక్ష్యము చేయకుడి. కానీ సమస్తమును పరీక్షించి, మేలైనదానిని చేపట్టుడని" థెస్సలొనీకయ సంఘమును ఆదేశించాడు (1 థెస్సలొనీకయులకు 5:19-21).

సంఘము స్థాపింపబడిన తొలి సంవత్సరములలో అబద్ధ ప్రవక్తలు ఉండిరి, గనుక పౌలు ఎఫెస్సులో నుండిన సంఘ పెద్దలను హెచ్చరించాడు, "నేను వెళ్లిపోయిన తరువాత క్రూరమైన తోడేళ్లు మీలో ప్రవేశించునని నాకు తెలియును, వారు మందను కనికరింపరు" (అపొస్తలుల కార్యములు 20:29). పేతురు కూడ హెచ్చరించాడు, "అటువలెనే మీలోను అబద్ధ బోధకులుందురు" (2 పేతురు 2:1). అపొస్తలుడైన యోహాను, పేతురు రచించిన తదుపరి ఎంతో కాలానికి తన లేఖను వ్రాసియుండినవాడు, "ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకము లోనికి బయలు వెళ్లియున్నారని" చెప్పాడు (1 యోహాను 4:1). "ఎవడైనను ఈ బోధను తేక మీ యొద్దకు వచ్చిన యెడల, వానిని మీ యింట చేర్చుకొనవద్దు, శుభమని వానితో చెప్పనువద్దు; శుభమని వానితో చెప్పువాడు వాని దుష్ట క్రియలలో పాలివాడగునని" కూడ యోహాను రచించాడు (2 యోహాను 10, 11). యేసు క్రీస్తు శరీరధారియై ఈ లోకమునకు రాలేదని బోధించుచుండినవారి గూర్చి ఆయన ప్రత్యేకముగా ప్రస్తావించుచుండెను. క్రైస్తవ్యములో నుండిన అబద్ధ ప్రవక్తలు మరియు అబద్ధ బోధకుల సంఖ్య సంఘము స్థాపింపబడినది మొదలుకొని అంతకంతకు ఎక్కువగుచునే యున్నది.[32]

ఈ అబద్ధ ప్రవక్తలు గొఱ్ఱెల చర్మములు వేసికొని వత్తురు కాని లోపల వారు క్రూరమైన తోడేళ్లని యేసు సెలవిచ్చాడు. అబద్ధ ప్రవక్తల మోసపుచ్చు స్వభావము రుజువగుచున్నది. ఈ అబద్ధ బోధకులు గొఱ్ఱెల వేషము కాదు, కానీ గొఱ్ఱెల కాపరుల వేషము వేసికొన్నవారై వత్తురు. వారు గొఱ్ఱెల ఉన్నిని ధరించుకొని, నిజమైన గొఱ్ఱెల కాపరుల వలె వత్తురని ఈ సాదృశ్యము వారిని మనముందు హాజరుపరచుచున్నది. ఈ విధమైన వస్త్రధారణ గొఱ్ఱెల చర్మముతో చేయబడినవి మాత్రమేగాక వెంట్రుకలతో నేయబడిన వస్త్రములను సహితము ధరించిన ప్రాచీన ప్రవక్తల పరంపరలో ఉన్నదే (2 రాజులు 1:8; జెకర్యా 13:4; మత్తయి 3:4; హెబ్రీయులకు 11:37).

ఈ కపట వేషధారులు ప్రత్యేకంగా అపాయకరమైనవారై యుండిరి ఎందుకనగా వారు గొఱ్ఱెల గూర్చి యథార్థముగా శ్రద్ధ వహించు దేవుని నిజమైన పరిచారకులై యున్నట్లు నటించారు. ఏదిఏమైనా, వారి ఉద్దేశమంతా, నాశనము చేయుట, మరియు, క్రూరమైన తోడేళ్ల వలె, మందను మ్రింగివేయుటయై యుండినది (యోహాను 10:10, 12; అపొస్తలుల కార్యములు 20:29; 2 కొరింథీయులకు 11:13-15; 2 తిమోతికి 3:13 చూడు). వారు నమ్మిన దాని గూర్చి వారు కపట వేషముతో తప్పుదోవ పట్టించువారై యుండిరి గనుక ఎంతసేపూ వ్యక్తిగత లాభము గూర్చియే ప్రోత్సాహింపబడుచుండినవారై యుండిరి.

**వచనము 16. వారి ఫలముల వలన మీరు వారిని తెలిసికొందురని** యేసు సెలవిచ్చాడు. అబద్ధ ప్రవక్తల ఆచూకీ మనమెలా తీయగలము? అనగా "వారి ఫలములను పరిశీలనగా పరీక్షించుట" యని ఆచరణ తీరులో, ఆయన చెప్పాడు. ఫలము, దానిని ఫలించు చెట్టు ఎటువంటిదో గుర్తుచేయుచున్నది. **ముండ్లపొదలలో ద్రాక్షా పండ్లైనను, పల్లేరు**

**చెట్లను అంజూరపు పండ్లైనను** ఫలింపవని యేసు చెప్పాడు. దానికి బదులుగా, ద్రాక్షాపండ్లు ముళ్లులేని ద్రాక్షా తీగెల మీదను, అంజూరపు పండ్లు నున్నవి బెరడున్న అంజూరపు చెట్లపైనను ఫలించును.

**వచనములు 17, 18. ఆలాగుననే ప్రతి మంచి చెట్టు మంచి ఫలములు ఫలించును, పనికిమాలిన చెట్టు కాని ఫలములు ఫలించును. మంచి చెట్టు కాని ఫలములు ఫలింపనేరదు, పనికిమాలిన చెట్టు మంచి ఫలములు ఫలింపనేరదని** యేసు చెప్పాడు. హిల్ ఇలా వివరించుచున్నాడు "హీబ్రూ మరియు అరబిక్ సంస్కృతులు కలిసిన భాషలో ఏదైన ఒక విషయమును నొక్కివక్కాణించు విధానమును ఈ వచనములు సోదాహరణంగా చిత్రీకరించుచున్నవి: ఈ వాంగ్మూలము నిశ్చయాత్మకముగా ఘోషింపబడినది (17), మరియు వెనువెంటనే వ్యతిరేకార్థకముగా పలుకబడినది (18)."[33] అబద్ధ ప్రవక్తల పనికిమాలిన ఫలము వారి అనైతిక జీవిత విధానమును లేక వారి ఉపదేశములను నేర్చుకొన్న వారి అవినీతిమయమైన జీవితములను సూచించుచుండవచ్చును.[34] వారి అబద్ధ బోధలు సహితము దీనిలో చేరియున్నవి (12:31–37; లూకా 6:43–45 చూడు). చెట్టు చెడ్డదైనందువలననే ఫలము పనికిమాలినదై యున్నది.

**వచనములు 19, 20.** "మంచి ఫలములు ఫలింపని ప్రతి చెట్టు నరకబడి అగ్నిలో వేయబడునని" పలుకుచు యేసు ముగించాడు. ఆయన మాటలు బాప్తిస్మమిచ్చు యోహాను పలికిన మాటలను పునరుక్తము గావించుచున్నవి (3:10 పై గల వ్యాఖ్యానము చూడు). పండ్ల చెట్లను పెంచువారు ఫలించక, పనికిరాకుండా ఉండు కొమ్మలను ఎడతెరపిలేకుండా కత్తిరించుచు తీసి పారవేయుచుండవలెను. ఫలించు చెట్లను నాటుటకు అవసరమైన చోటుండునట్లు వారు ఫలించని చెట్లను కూడ నరికివేయుచుండవలెను (యోహాను 15:2, 6 చూడు). ఆలాగుననే, తీర్పు దినాన అబద్ధ ప్రవక్తలు మరియు బోధకులు వేరుచేయబడి నిత్య నరకాగ్నిలో వేయబడుదురు (ప్రకటన 20:10). వారు తీర్పును ఇప్పుడు తప్పించుకొనుచున్నట్లు అగుపించవచ్చును, కానీ "వారికి పూర్వము నుండి విధింపబడిన తీర్పు ఆలస్యము చేయదు, వారి నాశనము కునికి నిద్రపోదు" (2 పేతురు 2:3) మీరు వారి ఫలముల వలన వారిని తెలిసికొందురను మాటలు ఉద్ఘాటింపు కొరకు పునరుక్తము గావింపబడుచున్నవి.

### రెండు విధములైన శిష్యులు (7:21–23)

**21–ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలచు ప్రతివాడును పరలోకరాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును. 22ఆ దినమందు అనేకులు నన్ను చూచి–ప్రభువా, ప్రభువా, మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములను వెళ్ళగొట్టలేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. 23అప్పుడు–నేను మిమ్మును ఎన్నడును ఎరుగను; అక్రమము చేయువారలారా, నా యొద్దనుండి పొండని వారితో చెప్పుదును.**

**వచనము 21.** ఆయనను వెంబడించుచుండిన వారిలో నుండిన రెండు విధములైన మనుష్యుల మధ్య గల వ్యత్యాసములను పోల్చి చెప్పుచు యేసు ముందుకుసాగాడు:

లోబడువారు మరియు లోబడనివారు. ఆయన మాటలు అబద్ధ ప్రవక్తల గూర్చిన, స్వయం వంచనతో శ్రమనొందుచుండినవారి గూర్చిన ప్రధానాంశమును కొనసాగించుచున్నట్లు అగుపించుచున్నది. వారు వారి శ్రోతలను లేక వారి ఉపదేశములను వినుచుండిన వారిని మాత్రమే మోసము చేయుచుండలేదు, కానీ అంతములో, వారు తమ్మును తామే మోసపుచ్చుకొనుచుండిరి.

అబద్ధ ప్రవక్తలు సహితము కొన్ని పర్యాయములు సత్యమును పలుకుచుందురని యేసు అంగీకరించాడు. వారు యేసును, **ప్రభువా, ప్రభువా** అని సంబోధించుట, వారు ఆయన అధికారమును మరియు దైవత్వమును అంగీకరించారని సూచించినది. వారి అంగీకారపుటొప్పుకోలులు "యేసు, ప్రభువని" ఆది సంఘము ఒప్పుకొనుచుండిన ఒప్పుకోలుతో సరిసమానమగుచున్నది (రోమీయులకు 10:9; 1 కొరింథీయులకు 12:3; ఫిలిప్పీయులకు 2:11). లూకా 6:46లో యేసు, "నేను చెప్పు మాటల ప్రకారము మీరు చేయక, 'ప్రభువా, ప్రభువా' అని నన్ను పిలుచుట ఎందుకు?" అని అడుగుచున్నాడు. "ప్రభువా, ప్రభువా" అను ఒప్పుకోలు మాత్రమే సరిపోదు. స్వయంవంచకులై అద్భుతములు చేయుచుండువారు ఈ మాటలు పలుకుచు యేసు యెదుట ఎంతో బిగ్గరగా కేకలు వేసినప్పటికిని, వారు **పరలోకరాజ్యములో ప్రవేశింపరు.** దేవుని **చిత్తము** చొప్పున చేయువారే **ప్రవేశించుదురని** యేసు చెప్పాడు. రక్షింపబడగోరువారు కొన్ని ఖచ్చితమైన షరతులను నెరవేర్చవలసి యున్నది: వారు దేవుని చిత్తమును తెలిసికొని దానికి లోబడవలసిన బాధ్యతగలవారై యున్నారు "మీరు నన్ను ప్రేమించిన యెడల, నా ఆజ్ఞలు గైకొందురని" యేసు సెలవిచ్చాడు (యోహాను 14:15). "మనమాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట ..." అని యోహాను అటుతరువాత రచించాడు (1 యోహాను 5:3).

**వచనము 22.** యేసు వర్ణించుచున్న సన్నివేశములో, అబద్ధ ప్రవక్తలు (అవిధేయులైన శిష్యులు) **ఆ దినమున,**[35] తీర్పు దినమున[36] యేసుకు వారి నివేదికను సమర్పించుచుండిరి. అబద్ధ ప్రవక్తలు కలిగియుండిన **ప్రవచన సామర్థ్యము, దయ్యములను వెళ్లగొట్టగల అధికారము, మరియు అనేక అద్భుతములు చేయగల శక్తిని** యేసు ధ్రువపర్చలేదు సరికదా, ఆయన దానిని లేదనలేదు. ఏదిఏమైనా, **మేము ... చేయలేదా?** అను మాటలు నిశ్చయాత్మకమైన ఒక సమాధానము కొరకు ఆశించినవి. కనీసము, వారు ఆ విధంగా చేసారని వారనుకొన్నారు. వారు యేసు **నామమును** ఆమంత్రణము చేయుచు, ఈ అద్భుతములు వాస్తవముగానే చేసియుండవచ్చును. మార్కు 9:38, 39లో, అపొస్తలుడైన యోహాను యేసు నొద్దకు వచ్చి ఒకడు వారి గుంపుకు చెందిన శిష్యుడు కాకపోయినప్పటికిని వాడు యేసు నామములో దయ్యములను వెళ్లగొట్టుచుండెనని తన అసంతుష్టిని అభివ్యక్తము చేసిన విషయము వ్రాయబడి యున్నది అపొస్తలుల కార్యములు 3:6 మరియు 9:34లో, అపొస్తలులు సఫలీకృతముగా స్వస్థపరచిన వారిపై యేసు నామమును ఉచ్చరించిన ఉదంతము వ్రాయబడియున్నది. ఒక సందర్భములో, యూదీయ మాంత్రికులు కొందరు వారి సొంతసానుకూల ప్రయోజనము కొరకు యేసు నామమును ఆమంత్రణము చేసారు, కానీ వారి పథకం వికటించింది. దయ్యముపట్టినవాడు వారిపై దాడిచేసాడు, వారిని దిగంబరులునుగా చేసి వారిని గాయపరచాడు (అపొస్తలుల కార్యములు 19:13-16).

**వచనము 23.** అవిధేయులైనవారికి యేసు ఇచ్చిన తీర్పును మనమిక్కడ

గమనించగలము. **చెప్పుదును** అని ఈ సందర్భములో చెప్పబడిన మాట చట్టపరమైన ఒక ప్రకటనను సూచించుచున్నది. వారంతా యేసును వెంబడించుచుండినవారై యున్నారని తమ్మును తాము పరిగణించుకొన్నారు, గనుకనే వారు అంత గొప్ప అద్భుతములు చేయగలిగారని విశ్వసించారు, కానీ వారు యేసు యొక్క యథార్థమైన అనుచరులు కారు.

**నేను మిమ్మును ఎన్నడును ఎరుగనని** యేసు వారితో నిష్కపటముగా చెప్పాడు. ఇదే మనోభావము ఐదుగురు బుద్ధిలేని కన్యకల గూర్చి ఆయన చెప్పిన ఉపమానములో వ్యక్తము చేయబడినది (25:12; లూకా 13:26 చూడు). ఇలాంటి అభివ్యక్తములో గల యేసు అర్థమేమిటి? "నేను మిమ్మును ఎన్నడును ఎరుగను" అను ఘోషణ ఒక తృణీకార సూత్రమై యున్నది (26:70, 72, 74 చూడు). "ప్రభువు తనవారిని ఎరుగునని" పౌలు ప్రకటించాడు. వెనువెంటనే ఆయన, "ప్రభువు నామమును ఒప్పుకొను ప్రతివాడును దుర్నీతి నుండి తొలగిపోవలెనని" చెప్పుచున్నాడు (2 తిమోతి 2:19).

**అక్రమము చేయువారలారా, నా యొద్ద నుండి పొండి** అను మాటలు, కీర్తనలు 6:8ని ప్రతిధ్వనించుచున్నవి. కీర్తనల గ్రంథంలోని మాటలు నీతిమంతుడైయుండి శ్రమనొందుచుండిన వాడు వానిని శ్రమపెట్టుచున్నవారితో చెప్పుచుండిన మాటలై యున్నవి, అంతేగాని అవి ప్రస్తుత సందర్భములోవలె, ఒక న్యాయ్యాధిపతి దుష్టుల గూర్చి చెప్పినవి కావు. "నాయొద్ద నుండి పొండి" అను మాటలు అవిధేయులు అనుభవించుచుండిన శిక్ష, వారు దేవుని సన్నిధిలో నుండి వెలివేయబడినటువంటిదని సూచించున్నవి (2 థెస్సలొనీకయులకు 1:9, 10; ప్రకటన 21:7, 8; 22:14, 15). వారు క్రీస్తును వెంబడించుచున్నవారైయున్నారని సాధికారముతో చెప్పుకొనుచుండినప్పటికిని, ఈ నకలీ సేవకులు "అక్రమమును అభ్యసించుట" మానలేదు. గ్రీకు భాషలో, "అభ్యసించుట" అని అర్థమిచ్చు పదము ఒక వర్తమానకాలిక కృదంత విశేషణమై యుండి, నిరంతరము కొనసాగుచునుండు చర్యను సూచించుచున్నది. వారు అసంఖ్యాకమైన మంచి పనులు చేయుచుండిరని వారు సాధికారంతో చెప్పుకొనుచుండినప్పటికిని, వారు అవిధేయతతో కూడిన జీవితము జీవించుచుండిరి.

### రెండు విధములైన నిర్మాణకులు (7:24–27)

**24కాబట్టి యీ నా మాటలు విని వాటిచొప్పున చేయు ప్రతివాడును బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును. 25వాన కురిసెను, వరదలువచ్చెను, గాలి విసిరి ఆ యింటిమీద కొట్టెను గాని దాని పునాది బండమీద వేయబడెను గనుక అది పడలేదు. 26మరియు యీ నా మాటలు విని వాటిచొప్పున చేయని ప్రతివాడు ఇసుకమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిహీనుని పోలియుండును. 27వాన కురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటిమీద కొట్టెను, అప్పుడది కూలబడెను; దాని పాటు గొప్పదని చెప్పెను.**

**వచనము 24.** యేసు రెండు విధములైన శ్రోతల (నిర్మాణకుల) గూర్చి ఉపమానముతో తన ప్రసంగమును ముగించాడు. ఈ సందర్భములో ఆయన **యీ నా మాటలు విను ప్రతివాడును** అంటూ రెండు పర్యాయములు ఉచ్చరించాడు (7:24, 26). ప్రభువు పలికిన మాటలు, ప్రజలు వారి శీలమును దానిపై నిర్మించవలసియున్న పునాదియై యున్నవి.

వినుట మాత్రమే చాలదు; ఆయన మాటలు వినిన దాని ప్రకారము **చేయవలెను**. కేవలము "వినుట"కును దానికి తారతమ్యముగా "చేయుట"కును గల ప్రాముఖ్యతను పరిశుద్ధ బైబిలు పదే పదే నొక్కివక్కాణించుచున్నది. ఒకడు కేవలము "వాక్యమును వినువాడు" మాత్రమైయుండి, వినిన దాని ప్రకారము "చేయని" వాడైనట్లయితే వాడు తనను తాను మోసపుచ్చుకొనుచున్నాడని యాకోబు చెప్పుచున్నాడు (యాకోబు 1:22-25). దేవుని వాక్యము ప్రకారము చేయువారు మాత్రమే ఆశీర్వదింపబడుదురు (ప్రకటన 1:3 చూడు).

ఆయన మాటలు విని వాటి చొప్పున చేయు విధేయులను యేసు **బండ మీద తన ఇల్లు కట్టుకొనిన బుద్ధిమంతునితో** పోల్చాడు. "బండ" (*petra*) "ఒక పెద్ద బండ" లేక ఒక "బండవలె గట్టిగా నున్న పునాది" అయియున్నది. ఇటువంటి బండ, సుస్థిరమైన, కదలని, మరియు భద్రతనిచ్చు పునాదిగా ప్రయోజనకరమైనదై యుండును. తుఫాను వచ్చి బుద్ధిమంతుని ఇంటి మీద కొట్టగా, అది స్థిరముగా నిలిచియుండినది. రాతి మీద నిర్మించుట అనగా, యేసు ఉపదేశములకు విధేయతతో లోబడుటయని అర్థము. మనము మన ఆధ్యాత్మిక ఇళ్లను బండవలె గట్టిగా నున్న పునాదివలె నుండు ఆయన సత్యము మీద నిర్మించుకొన్నప్పుడు, మన విశ్వాసము స్థిరమైనదిగా నిలిచియుండును మరియు జీవితములో తీవ్రమైన పెనుతుఫానులు ఎదురైనప్పుడు అది మనలను కదలనివారుగాను సుస్థిరులుగా నిలిపియుంచును.

**వచనము 25.** యేసు ముందుకు సాగాడు, **వాన కురిసెను, వరదలు వచ్చెను. గాలి విసిరి ఆ యింటి మీద కొట్టెనుగాని దాని పునాది బండ మీద వేయబడెను గనుక, అది పడలేదు.** గ్రీకు వాక్యభాగము ఒక శబ్దచమత్కారమును (*prosepesan ... epesen*) సూచించుచున్నది. లియోన్ మోర్రిస్ ఉపమానములోని ఈ భాగమును ఈ క్రింది విధముగా అనువదించాడు: "గాలి ఆ *ఇంటికి ప్రతికూలముగా* వీచినది, అట్లయినను ఆ ఇల్లు కూలలేదు."[37] యేసు పలికిన ప్రకటనకు గల నేపథ్యమునకు సంబంధించినంత వరకు, "ఈ మనఃకల్పన పాలస్తీనాలోని వాతావరణ పరిస్థితుల మూలమున కలుగుచున్నది. పాలస్తినా దేశం దాదాపుగా సంవత్సరం పొడవునా పొడిగా ఉంటుంది, కానీ వసంత కాలపు వర్షములు కురిసిన తరువాత, ఆకస్మిక కుండపోత వర్షపు నీరు పొడిగా నున్న లోతైన లోయల గుండా వేగవంతముగా ప్రవహించుచు ప్రవాహమునకు ఎదురుగా వచ్చు ప్రతి వస్తువును దానితో కూడ తీసికొనివెళ్లును"[38] అని మౌన్స్ చెప్పాడు. యేసు కొండ మీద ప్రసంగము చేసినప్పుడు, ఆయన గలిలయ సముద్రమునకు సమీపముగా ఉండెను; గనుక ఈ ఏర్పాటు కథా నేపథ్యమునకు గల మరొక సాధ్యతను మనముందుంచుచున్నది. విల్కిన్స్ ఇలా ప్రతిపాదించాడు,

> మెరక వేయబడిన ఒండ్రు ఇసుక గలిలయ సముద్ర తీరమంతా నిండుకొని ఎండా కాలంలో దాని పైభాగములో గట్టిగా ఉండినది. కానీ వివేకవంతుడైన గృహ నిర్మాణకుడు ఇటువంటి పై పై పరిస్థితులకు మోసపోడు. అతడు కొన్ని పర్యాయములు ఆ ఇసుక ఉపరితలమును క్రింద అట్టడుగు పునాదిని తగులునట్లు దాదాపు పది అడుగుల లోతు వరకు త్రవ్వి, తన ఇల్లు నిర్మాణము నిమిత్తము దానిని పునాదిగా చేసికొనును [లూకా 6:46-49]. శీతాకాలపు వర్షములు కురిసిన సమయంలో, ఆ నీరు యొర్దాను నది యొక్క తీరముల మీదగా సముద్రము లోనికి ప్రవహించునప్పుడు, మెరకవేయబడిన ఒండ్రు ఇసుక మీద నిర్మింపబడిన

ఇళ్లు ఆ వరదలకు తట్టుకొనగలిగినవి.[39]

**వచనములు 26, 27.** దీనికి తారతమ్యముగా, ఉపమానములో పేర్కొనబడిన **బుద్ధిహీనుడు** తన ఇల్లును **ఇసుక మీద కట్టుకొన్నాడు**. ఇసుక అస్థిరమైనది, నిరంతరము దాని ఉనికిని మార్చుకొనుచునే యుండును, సులభంగా వరద నీటికి కొట్టుకొనిపోవును. తుఫాను గాలి బుద్ధిహీనుని ఇంటి మీద కొట్టినప్పుడు, **అది కూలిపోయినది–దాని పాటు గొప్పదై యుండెను**. ప్రజలు "మనుష్యుల మాయోపాయములచేత వంచనతోను, తప్పుమార్గమునకు లాగు కుయుక్తితోను, గాలికి కొట్టుకొనిపోవునట్లు, కల్పింపబడిన ప్రతి ఉపదేశమును" అంగీకరించుచు (ఎఫెసీయులకు 4:14) వారి ఆధ్యాత్మిక ఇళ్లను తరుచుగా ఇసుక మీద నిర్మించుకొందురు. వారి విశ్వాసము అభిప్రాయములు, ఊహకల్పితములు, మరియు కట్టుకథలపై ఆధారపడి యున్నది (2 తిమోతికి 4:1–4 చూడు). మన ఆధ్యాత్మిక గృహములు పరీక్షింపబడునని యేసు స్పష్టం చేసాడు. బండ మీద కట్టబడినవారు తీర్పు దినాన అంతిమ పరీక్షను తట్టుకొందురు. ఎప్పుడు చూచినా సుస్థిరముగా నిలువక యుండు కాలమును ఇసుక మీద కట్టబడినవారు "ఆ దినమును" తట్టుకొనలేరు (కీర్తనలు 1:6; 127:1; మత్తయి 15:13).

## జనసమూహముల ఆశ్చర్యము (7:28, 29)

**[28]యేసు ఈ మాటలు చెప్పి ముగించినప్పుడు జనసమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడుచుండిరి. [29]ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలె కాక అధికారముగలవానివలె వారికి బోధించెను.**

**వచనము 28. యేసు ఈ మాటలు చెప్పి ముగించినప్పుడు** అను మాటలు లేదా వాటికి సమానమైన పలుకులు మత్తయి వ్రాసిన సువార్తలో ఐదు పర్యాయములు అగుపించుచు (7:28; 11:1; 13:53; 19:1; 26:1), యేసు చేసిన ఐదు ఉపదేశముల యొక్క విభాగముల ముగింపునకు ఇవి గుర్తుగా ఉంటున్నవి. ఆయన సందేశం మొత్తం దేని గూర్చియై యుండినదో దాని మౌలికమైన అంశములు ఈ ప్రసంగములో ఉండినవి. ఆయన సందేశములోని మిగిలిన భాగములు ఆయన వ్యక్తిగత్త పరిచర్య యందంతటను అందించబడినవి.

**వచనము 29.** ఈ ప్రసంగమును విన్నవారు యేసు మాటలకు ఆశ్చర్యపడుచుండిరి. **ఆయన వారి శాస్త్రుల వలె కాక అధికారముగలవానివలె వారికి బోధించెను.** "అధికారము" అని అర్థమిచ్చుచుండిన గ్రీకు పదము (*exousia*) ఒకరు పరిపాలించుటకు లేక ఏలుబడి చేయుటకు కలిగియుండు అధికారమును సూచించుచున్నది (8:9; 9:6; 10:1; 21:23 చూడు). యేసు తన మహా ఆదేశమును జారీ చేసినప్పుడు ఆయన ఈ పదమును ప్రయోగించాడు (28:18). శాస్త్రులు అంతకు మునుపటి యూదీయ విద్వాంసుల రచనలలో నుండి సుదీర్ఘమైన వాక్యభాగ్యములను ఉల్లేఖించి చెప్పుట ద్వారా ఉపదేశించారు. వారి అభిప్రాయములకు సాయపడునట్లు వారు పూర్వోదాహరణలు లేకుండా వాటిని అభివ్యక్తము చేయుటకు భయపడుచుండిరి. ఏ. టి. రాబర్ట్సన్ ఇలా వ్రాయుచున్నాడు, "ఈ దీర్ఘోపన్యాసముల నమూనాలు, మిష్నా మరియు గెమర పూర్తిచేయబడినప్పుడు వాటిలో,

అనగా యూదీయ టాల్ముడ్‌లో, భద్రపరచబడినవి మనకు అందుబాటులో నున్నవి. మానవ జాతి చరిత్రలో ఊహించుకొనబడగల ప్రతి సమస్య గూర్చిన పొంతనలేని వ్యాఖ్యానములతో అవి నిస్సారమైనవిగాను. అత్యంత మందకొడిగానున్న సేకరణలై యున్నవి."[40] యూదీయ బోధకులకు తారతమ్యముగా, యేసు, తేజశ్శాలియైనవి, వెక్తిగతమైనవి, మరియు సోదాహరణముగా చిత్రీకరింపబడిన ఉపదేశములను సాధికారముగల దేవుని వాక్యము వలె ఉపదేశించుచుండెను (యోహాను 5:27; 10:18; 17:2 చూడు). ఆయన ఉపదేశములకు సాయపడునట్లు మానవ అధికారము ఆయనకు అవసరమే లేకుండినది. "నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" (5:18, 20, 22, 26, 28, 32, 34, 39, 44; 6:2, 5, 16, 25, 29) మరియు "ఈ నా మాటలు" (7:24, 26) అను కీలకమైన పదజాలముల ద్వారా ఈ ప్రసంగములో ఆయన అధికారము ఉద్ఘాటించి తెలియజెప్పబడినది.

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### "తీర్పు తీర్చకుడి" (7:1–5)

ఒకడు అదే విధమైన లేక మరి ఎక్కువ దారుణమైన పాపములలో లగ్నమగుచునే, మరొకరిని ఖండించు విధానములో ప్రదర్శింపబడిన వేషధారణతో కూడిన తీర్పును యేసు ఖండించాడు. మౌన్స్ ఇలా వివరించుచున్నాడు,

> మనము మన సొంత పొరపాట్ల కంటే ఇతరుల దోషముల గూర్చే ఎంతో ఎక్కువ శ్రద్ధ చూపించునట్లు మానవ స్వభావము మనలను ప్రోత్సాహించుచుండును. ఏదో ఒక విధంగా మనము మన సొంత చర్యలకు అన్వయింపబడని నీతిమంతమునకు సంబంధించిన ఉన్నతాదర్శముగల ప్రమాణము ఆధారంగా ఇతరులను అంచనా వేయుటకు ఉన్ముఖులమై యుందుము.[41]

మనము ఇతరుల గూర్చి చేయుచుండు మందింపులో న్యాయసమ్మతముగా నుండునట్లు, మనము అనేక మార్గనిర్దేశక సూత్రములను అనుసరించుచుండవలెను.

*మనము మన సొంత జీవితములను మదింపు చేసికొనవలెను.* ఇతరులలో మనకు న్యాయవిరుద్ధమని అగుపించు విషయములను మనమే చేయుచున్నామేమో యని మొదట మనలను మనమే ప్రశ్నించుకొనవలెను. ఒకడు లోకమును మార్చవలెనని ప్రయత్నము చేయక మునుపు వాడు తానే మొదట మారవలసి యున్నది.

*ఇతరులు మనలను విమర్శించునప్పుడు మనము ఆలకించవలెను.* వారు చెప్పుచున్న దానిలో కొంత సత్యముండవచ్చును మరియు అది మనము మంచివారమగుటకు మనకే సహాయకరముగా నుండను. ఇనుము, ఇనుమును పదునుచేయగల స్వభావము కలిగియున్నది (సామెతలు 27:17).

*మనలను గూర్చి ఇతరుల మనస్సులలో చెరగని మంచి ముద్ర వేయుటకు మనము అతిగా ప్రయత్నించ నవసరములేదు.* ఒక వ్యక్తిని తెలిసికొనుటకు లేక అర్థంచేసికొనుటకు ఒక్క సారి కలుసుకొనుటతో సాధారణంగా పని ముగియదు. కొన్ని పర్యాయములు తొలి అభిప్రాయములు సరైనవై యుండవు.

*మనము ఒక్కసారిగా తుది అభిప్రాయములను ఏర్పరచుకొన కూడదు.* సాధ్యమైనన్ని

వాస్తవములను సేకరించి ఇతరుల గూర్చిన మన తుది అభిప్రాయములు చెప్పుడు మాటలు వినుటవలన ఏర్పడినవి కావని నిశ్చయపర్చుకొనుటకు మనము ప్రయత్నించవలెను.

*ఇతరులను వారిలో మార్పేమియు రానివారిగా చేయకూడదు.* ఒకరి జాతి, లింగము, లేదా సామాజిక, మరియు ఆర్థిక స్థాయి ఆధారంగా వారికి తీర్పు తీర్చుట న్యాయసమ్మతము కాదు.

*ఇతరులను మితిమీరి విమర్శింపక మునుపు మనము వారి పరిస్థితులను పరిగణ లోనికి తీసుకొనవలెను.* ఒక వేళ అవతలి వ్యక్తి తన జీవితములో ఎదురగుచున్న క్లిష్టమైన విషయములతో వ్యవహరించుచుండవచ్చును. వారెదుర్కొనుచున్న పరిస్థితుల్లో మనమున్నట్లయితే, బహుశా మనము కూడ అవతలి వ్యక్తి మాదిరిగనే ప్రవర్తింపవచ్చును.

*మనము ఇతరులతో ఘర్షణపడినప్పుడు, మన ప్రోత్సాహకముల విలువను అంచనా వేసికొనవలెను.* మనము ఇతరుల ఆధ్యాత్మిక పరిస్థితుల గూర్చి ఆందోళన చెందుచున్నామా (గలతీయులకు 6:1–4), లేక కేవలము మనము వారి కంటె మంచివారమను అభిప్రాయమును కల్పించుటకు ప్రయత్నించుచున్నామా?

*ముగింపు.* వేషధారియైనవాడు మరొకరికి తీర్పుతీర్చుట గూర్చి యేసు సోదాహరణంగా విశదీకరించిన చిత్రీకరణము మనకొక హెచ్చరికగా పనికివచ్చుచున్నది.

డేవిడ్ స్టూవర్ట్

## పరిపూర్ణుడైన తండ్రి
## (7:7–11)

ఇహలోక తండ్రులు, లోపభూయిష్టమైనవారు మరియు పాపిష్టులునైనవారు, వారి పిల్లలకు మంచి యీవుల నిచ్చెదరని యేసు సూచించాడు. ఇహలోక తండ్రులను చూచుట ద్వార, పరలోక తండ్రి యొక్క ప్రేమను మరియు ప్రార్థనలో ఆయనతో కలిగియున్న సంబంధమును చక్కగా అర్థంచేసికొనగలము.

నేటి రోజుల్లో ఇహలోక తండ్రులు వారి పిల్లల అవసరములను సమకూర్చుటకు వారి శక్తిసామర్థ్యములను ఎంతగానో హెచ్చించుచున్నారు. ఆహారము, వస్త్రములు, మరియు తలదాచుకొనుటకు ఇల్లు మొదలగు జీవిత మౌలిక సదుపాయములు వారికి సమకూర్చబడినవని వారు రూఢిపర్చుకొనుచుందురు. అంత కంటే ఎక్కువగా, విద్యాభ్యాసము ద్వారా పిల్లల మేధా సంబంధ సంపత్తి యొక్క అభివృద్ధికి అవసరమైన ప్రతి విషయాన్ని తండ్రులు సమకూర్చుచుందుదురు. పిల్లలు ఇంటి యొద్ద చేయవలసిన విద్యాభ్యాస “ఇంటి పని” మరియు ప్రతేక పథకములలో వారికి సహాయము చేయుచుందురు, పాఠశాల కమీటిలలోను, పరిషత్తులలోను సభ్యులుగా పనులు చేయుచు, వారి పుస్తకముల కొరకును శిక్షణ కొరకును అవసరమైన రుసుము చెల్లించుచుందురు. వారి పిల్లలు ఆటల్లోను, క్రీడల్లోను రాణించునట్లు వారితో కూడ ఎంతో సమయము గడుపుచు, అందుబాటులో నుండు స్థలాల్లో వారితో కూడ ఆటలాడుచు, తరుచుగా వారికి సకల విధాల సహాయము చేయుచుందురు. వారి పిల్లలు ఆధ్యాత్మికముగా కూడ అభివృద్ధిచెందుచుండవలెనని తండ్రులు వారికి బైబిల్ వాక్యభాగములను చదివి వినిపించుచు, వారితో కూడ కలిసి ప్రార్థించుచు, మాదిరి క్రైస్తవ జీవితమును వారి యెదుట ప్రదర్శించుచు, వారిని ఆరాధాన నిమిత్తము సమాజ కూడికకు

తీసికొనివెళ్లుచు, బైబిల్ తరగతులలో నేర్పించుచుందురు. ఇహలోక తండ్రులు వారి పిల్లల శ్రేయస్సు కొరకు ఇన్ని పనులు చేయుచున్నట్లయితే, ఆయన పిల్లల ప్రయోజనార్థమై పరలోక తండ్రి మరి నిశ్చయముగా అంత కంటె ఎక్కువ చేయును కదా?

ఇహలోక తండ్రుల వలెనే, మన పరలోక తండ్రి మన చింతలు మరియు అవసరముల గూర్చి, అవి పెద్దవైనను సరే చిన్నవైనను సరే, వాటి గూర్చి ఆయన చింతించుచున్నాడు. మనము అడుగక మునుపే మనకు అవసరముగా నున్న వేమిటో ఆయన ఎరిగి యున్నాడు. అది మన సొంత మేలు కొరకే అనియు, మన ఆధ్యాత్మిక ఎదుగుదల నిమిత్తమే అనియు ఆయన ఎరిగియుండి, జీవితములో కష్టములతో మనము పోరాడునట్లు కొన్ని పర్యాయములు ఆయన అనుమతించును. అనేక పర్యాయములు మనము అడుగకపోయినను ఆయన మన అవసరములను తీర్చుచున్నాడు, అంతమాత్రమేగాక మనము ఆయనకు కృతజ్ఞత తెలియజేసుకొనుటకు మర్చిపోయినప్పటికిని మన అవసరములను తీర్చుచునే యున్నాడు. ఇతర సమయాల్లో మనము ఆయనను అడుగవలెనని ఆయన మన కొరకు వేచియుంటున్నాడు ఏలయనగా మనము ఆయన యందు యింకా ఎక్కువగా విశ్వసించవలెననియు, మనము ఆయన మీదనే ఆధారపడవలసినవారమై యున్నామనియు గుర్తించవలెనని ఆయన ఆశించుచున్నాడు. మన తండ్రి మనకు అనుగ్రహించిన ఏదైనా ఒక దీవెన యెడల మనము భాధ్యతారహితంగా ప్రవర్తించినప్పుడు ఆయన దానిని ఉపసంహరించుకొనవచ్చును. ఏదిఏమైనా, మన ఇహలోక తండ్రుల వలె గాక, మన పరలోక తండ్రి పరిపూర్ణుడై యున్నాడు గనుక మన అవసరముల గూర్చి చింతించుటకు ఆయన అపరిమితమైన వనరులు కలిగియున్నాడు.

డేవిడ్ స్టూవర్ట్

## సువర్ణ సూత్రము (7:12)

“సువర్ణ సూత్రము” అని ప్రసిద్ధిగాంచిన దాని గూర్చి, “కావున మనుష్యులు మీకు ఏమిచేయవలెనని మీరు కొరుదురో, ఆలాగుననే మీరును వారికి చేయుడని” యేసు ఆదేశించాడు (7:12). మన అనుదిన జీవితాల్లో, ఈ ఉపదేశము అనేక సందర్భాల్లో అన్వయింపబడగలదని మనము గమనించుచున్నాము.

మొదటిది, ఆయన చేసిన ప్రకటన యొక్క సరళతను గుర్తించండి. అది, ఎవరైనను ఈ సూత్రమునకు లోబడగలుగునంత సామాన్యమైనదై యున్నది. మనము ఇతరులతో వ్యవహరింపవలసిన బాధ్యతను అది మన మీద వ్యక్తిగతముగా మోపుచున్నది, గనుక అది వారు మన యెడల వ్యవహరించు విధానముచేత నిర్ధారింపబడుట లేదు. అవశ్యముగా “నీవు నా యెడల ఎలా వ్యవహరించుచున్నావో అను విషయంతో నిమిత్తము లేకుండానే, నేను మాత్రం నీ యెడల మర్యాదపూర్వకంగాను, గౌరవంతోను వ్యవహరిస్తాను, ఏలయనగా నీవు కూడ నాతో ఇలాగే వ్యవహరించవలెనని నేను ఆశిస్తున్నానని” మనము ఇతరులతో చెప్పుచున్నామని అర్థమగుచున్నది.

రెండవది, ఈ వాంగ్మూలము ఎవరినైనను లేక దేనినైనను మినహాయించుట లేదు, ఏలయనగా “ఏమి చేయవలెనని మీరు కోరుదురో” అని అది సెలవిచ్చుచున్నది. ఏ వ్యక్తియైనను లేక మన యెడల అగౌరం ప్రదర్శింపబడు ఏ విధానమైనను విడచిపెట్టబడలేదు;

దీనిలో మనలను ద్వేషించువారును, మనతో అమర్యాదగా ప్రవర్తించువారును కలుపబడి యున్నారు. మనము మన శత్రువులతో సహితము ఎలా వ్యవహరించాలో మన ప్రభువు మనకొక మంచి మాదిరిని ఉంచియున్నాడు (లూకా 23:34; 1 పేతురు 2:21).

మూడవది, ఈ వాంగ్మూలము ఒక సలహాను మించినదై యున్నది. అదొక ఉద్ఘాటింపుతో కూడిన ఘోషణయై యున్నది, ఆయనను వెంబడించుచుండినవారికి యేసు ఇచ్చుచుండిన విధాయకమైన ఒక ప్రవర్తనా నియమావళియై యున్నది. అది ఎంతకష్టమైనప్పటికిని, మనము ఈ విధివిహిత వాచకమునకు లోబడుటకు బద్ధులమై యున్నాము.

### జీవిత నియమములు (7:12)

ప్రజలు సువర్ణ సూత్రము ననుసరించుచు జీవించాలే కానీ, మన దినములు నిజాయితీ మరియు దయతో కూడిన వ్యవహారములతో నిండినవై యుండును. ఏదిఏమైనా, ప్రజలు ప్రాథమికంగా ఈ క్రింది ఏడింటిలో ఏదో ఒక నియమము చొప్పున జీవించుచుందురని చెప్పబడుచున్నది:

1. *జిగటగల ఊబి నియమము.* అన్ని నియమముల కన్న నిమ్నమైన నియమము. అది స్వార్థము మరియు అపకీర్తిపాలైన జీవిత శైలియై యున్నది. ఈ మురుగు నీటి కాలువ తత్వమును అభ్యసించువారు ఇతరులను ఏలుదురు లేదా వారిని నాశనము చేయుదురు.

2. *బంకమట్టి నియమము.* ఇది "తనలో తాను ఆనందానుభూతి చెందుటకు వాని సమయమును వెచ్చించు ధనవంతునివలె," ఇంద్రియ సుఖమే అన్నిటికన్నా మిన్నయని చెప్పు తాత్త్విక ధోరణితో, భౌతిక విషయములకు ప్రాధాన్యత నిచ్చు జీవిత విధానమై యున్నది. ఇది ఎపీక్యూరియనుల తత్త్వమై యుండినది – "తిను, తాగు, సంతోషించు, ఏలయనగా రేపటి దినాన నీవు బ్రతికుండవు."

3. *ఇనుము నియమము.* ఇది "చాలినంత కండ బలమున్నవాడు, 'ఏ పనైనా చేయు సర్వహక్కులు నావే.' " అను ధోరణిగల నియమమై యున్నది. యేసు చెప్పిన మంచి సమరయుని ఉపమానములో, ప్రయాణికున్ని కొట్టి, దోచుకొని, వానిని కొరప్రాణంతో వదిలిపెట్టారని పేర్కొనబడిన వారి తత్వము ఇదే అయియుండినది.

4. *ఇత్తడి నియమము.* ఇది ఇచ్చిపుచ్చుకొను పద్ధతిని పాటించు నియమము: "ఇతరులు నీ యెడల ఎలా వ్యవహరిస్తారో నీవు కూడ వారి యెడల అదే విధముగా వ్యవహరించుము"; "కంటికి కన్ను, పంటికి పన్ను" విధానము. ఇది "చట్టబద్ధమైన నియమమని" కూడ పిలువబడినది.

5. *వెండి నియమము.* "వ్యతిరేకార్థక మంచితనము" గల నియమమై యున్నది ఈ నియమము ప్రకారము జీవించువారు ఎవరికైనను ఎన్నడైనను ఏ హాని చేయరు, కానీ మంచి కూడా చేయరు.

6. *పూత బంగారం నియమము.* ఇది సువర్ణ సూత్రమునకు విలోమమైన నియమమై యున్నది: "ఇతరులు నీకు ఏమి చేయకూడదని నీవు కోరుదువో ఆలాగుననే నీవు ఇతరులకు చేయవద్దు." ఈ నియమమును పాటించుటకు ఒకడు పారమార్థికబుద్ధిగలవాడై యుండనవసరములేదు.

7. *సువర్ణ సూత్రము.* ఇది నియమములన్నిటిలో చివరిది. ఈ నియమము

నైతికముగా ఆదర్శప్రాయమైనదై యున్నదని క్రైస్తవేతరుల చేత సహితము అంగీకరింపబడుచున్నది. “మానవ బలహీనత మూలమున, సువర్ణ సూత్రము అనుదినము ఉల్లంఘింపబడుచుండవచ్చును, కానీ ఈ గొప్ప సూత్రము, సమస్త మానవాళి యొక్క సమిష్టి మేలును కోరవలెనని గురిగా పెట్టుకొన్నది, నేడు మనము జీవించుచున్న ఆధునిక ప్రపంచంలోని సకల బలములలోనికి చొచ్చుకొనిపోయి వాటిని గంభీరంగా పరివర్తింప జేయుచున్నది” మాజీ అమెరికా దేశాధ్యక్షుడు, హెర్బర్ట్ హూవర్ చెప్పుచున్నాడు.[42] ఇది ఇలా ఉండగా, ప్రపంచములోని ప్రతి ఒక్కరు ఈ సూత్రమును పాటించునట్లు చేయుట సాధ్యము చేయగలిగినట్లయితే, అది ఎంతో వ్యత్యాసమును కలుగజేయునుకదా![43]

## ఎంపికలు చేసుకొనుట (7:13-27)

మనము అనుదినము ఎంపిక చేసుకొనవలసిన పరిస్థితులను ఎదుర్కొనుచుందుము. కొన్ని పర్యాయములు మనము మంచి దానికిని ఉత్తమమైన దానికిని మధ్య ఎంపిక చేసికొనవలసి యుండును. ఇతర సమయాల్లో మనము రెండు అల్పమైన చెడు విషయముల నడుమ ఎంపిక చేసికొనవలసియుండును. ప్రస్తుత వాక్యభాగములో, ఎంపికలు స్పష్టముగా మంచికిని చెడునకును మధ్య చేసికొనవలసినవై యున్నవి. మనము ఈ క్రింది వాటిలో ఏదో ఒక దానిని ఎంపికచేసికొనవలసి యున్నది:

1. ఇరుకు మార్గములో వెళ్లడమా లేక విశాలమైన మార్గములోనా (7:13, 14);
2. మంచి ఫలములు ఫలించడమా లేక చెడ్డ ఫలమునా (7:15-20);
3. విధేయతతో లోబడుటయా లేక లోబడకుండుటయా (7:21-23);
4. బండ మీద కట్టుకొనుటమా లేక ఇసుక మీదనా (7:24-27).

## సరైన మార్గమును ఎన్నుకొనుట (7:13, 14)

ఈ వచనములలో, రెండు విభిన్న గమ్యస్థానములకు దారి తీయు జీవితములోని రెండు మార్గముల మధ్య చేసికొనబడవలసి యుండిన ఎంపికను వర్ణించుటకు యేసు ఒక మార్గము యొక్క అలంకారమును ప్రయోగించాడు. ఈ రెండు మార్గములలో నుండి ఏ మార్గములో పయనించుటకు మనము ఎన్నుకొందుమో అది సంపూర్తిగా మనకే విడచిపెట్టబడి యున్నది. సృష్ట్యాది నుండి కూడ – ఏదెను తోటలోని ఆదాము మరియు హవ్వ మొదలుకొని – ప్రజలు వారి సొంత ఎంపికలు చేసికొనుటను దేవుడు అనుమతించాడు.

క్రైస్తవ జీవితము తరుచుగా ఒక “మార్గము”గా వర్ణింపబడినది. వాస్తవమునకు, ఆది సంఘము ప్రజాదరణ పొంది ప్రసిద్ధిగాంచినదై యుండిన నామములలో ఇదొకటై యుండినది (అపొస్తలుల కార్యములు 9:2; 24:14) “నీతిమంతుల మార్గము” మరియు “దుష్టుల మార్గము” మధ్య గల ఎంపికను కీర్తనకారుడు వర్ణించాడు (కీర్తనలు 1:1-6). రానైయుండిన క్రైస్తవ యుగమును సూచించిన ఒక ప్రవచనములో, ప్రవక్తయైన యెషయా ఇలా వ్రాసాడు,

> అక్కడ దారిగా నున్న రాజమార్గము ఏర్పడును,
> అది పరిశుద్ధ మార్గమనబడును.

> అది అపవిత్రులు పోకూడని మార్గము,
> అది మార్గమున పోవువారికి ఏర్పరచబడును,
> మూఢులైనను దానిలో నడుచుచు త్రోవను తప్పక యుందురు (యెషయా 35:8).

ఆధ్యాత్మిక నిస్సత్తువను వారు అధిగమించవలెనని ఆయన తన చదువరులను ప్రోత్సాహించు ఉద్దేశముతో రచించుచు, "కాబట్టి సడలిన చేతులను సడలిన మోకాళ్లను బలపరచుడి, మరియు కుంటికాలు బెణకక బాగుపడునిమిత్తము మీ పాదములకు మార్గములను సరాళము చేసికొనుడని" హెబ్రీ పత్రిక రచయిత పేర్కొనుచున్నాడు (హెబ్రీయులకు 12:12, 13).

ఇశ్రాయేలీయులు కనాను దేశములో ప్రవేశించుటకు సిద్ధపడుచుండగా, ప్రజలందరికి ఒక వీడ్కోలు సందేశము నందించుటకును, వాగ్దానము చేయబడిన దేశములోనికి వారితో కూడ ఆయన వెళ్లుట లేదను సమాచారమును వారికి తెలియజెప్పుటకును వారినందరిని మోషే పోగుచేసాడు (ద్వితీయోపదేశకాండము 31:2). ఈ చిట్టచివరి ఉపన్యాసములో, వారు దేవుని యెడల విశ్వసనీయమైనవారై యుండవలెనని ఆయన వారికి ఒక నిష్పాక్షికమును, ఉద్రేకపూరితమునైన విన్నపము చేసాడు (ద్వితీయోపదేశకాండము 30:19).

ఆయన మరణించుటకు కొంత కాలము క్రితం, యెహోషువ కూడ అదే విధముగా ఇశ్రాయేలీయులను సవాలు చేయుచు ఇలా పలికాడు,

> కాబట్టి మీరు యెహోవాయందు భయభక్తులుగలవారై, ఆయనను నిష్కపటముగాను సత్యముగాను సేవించుచు, మీ పితురులు నది అద్దరిని ఐగుప్తులోను సేవించిన దేవతలను తొలగద్రోసి యెహోవానే సేవించుడి. యెహోవాను సేవించుట మీ దృష్టికి కీడని తోచిన యెడల మీరు ఎవని సేవించెదరో, నది అద్దరిని మీ పితురులు సేవించిన దేవతలను సేవించేదరో, అమోరీయుల దేశమున మీరు నివసించుచున్నారే వారి దేవతలను సేవించెదరో నేడు మీరు కోరుకొనుడి; మీరెవరిని సేవింప కోరుకొనినను నేనును నా యింటివారును యెహోవాను సేవించెదము అనెను (24:14, 15; NIV).

ఉత్తరమున నుండిన రాజ్యము బయలు దేవతను ఆరాధించు దిశగా దాదాపుగా కొట్టుకొని పోయినప్పుడు, ఏలీయా బయలు ప్రవక్తలను కర్మెలు పర్వతముపై కలిసికొన్నాడు. ఇశ్రాయేలీయులు చేయుచుండినది "తప్పు" అను ప్రతివాదము చేత ఆయన మతపరమైన సర్వపక్షధర్మ సమన్వయమును పడగొట్టుచు, వారిని ఇలా ప్రశ్నించాడు, "యెన్నాళ్ల మట్టుకు మీరు రెండు తలంపుల మధ్య తడబడుచుందురు? యెహోవా దేవుడైతే, ఆయనను అనుసరించుడి; బయలు దేవుడైతే, వాని ననుసరించుడి" (1 రాజులు 18:21).

యిర్మీయా యూదా దేశ ప్రజలకు వారి ముందుండిన ఎంపికను గుర్తు చేశాడు: యెరూషలేములోనే నిలిచియుండి దానితో కూడ నాశనమగుట లేదా దానిలో నుండి పారిపోవుట ఏలయనగా దేవుని తీర్పు సమీపించుచుండినది. "యెహోవా సెలవిచ్చునదేమనగా, 'ఇదిగో, జీవమార్గమును మరణమార్గమును నేను మీ యెదుట పెట్టుచున్నానని' " ఆయన రచించాడు (యిర్మీయా 21:8).

మొదటి నుండి కూడ, ప్రజలు ముందర వాస్తవమునకు రెండే రెండు ఎంపికలున్నవని దేవుడు స్పష్టంగా తెలియజేసాడు. మనము దేవునికి లోబడుటకు లేదా లోబడకుండుటకు

ఎంపికచేసుకొనవచ్చును. దేవుని యొద్దకు అనేక మార్గములు లేవు; ఒక్క మార్గము మాత్రమే యున్నది (యోహాను 14:6). పరలోకమునకు దారీ తీయునవి అనేక బాటలు లేవు; ఒక్కటే ఉన్నది (7:14). మనము నిజమైన మతమునకును అబద్ధమైన మతమునకును మధ్య ఎంపికచేసికొనవలసి యున్నది (15:7-9). కొండ మీద ప్రసంగము నిత్య జీవమునకు దారి తీయు దేవుని నీతికిని మరియు నిత్య మరణమునకు దారితీయు శాస్త్రులు మరియు పరిసయ్యుల వేషధారణకును మధ్య ఒక తారతమ్యమై యున్నది (5:20).

### విశాల మార్గము మరియు ఇరుకు ద్వారము (7:13, 14)

"విశాల" మార్గము సహనముతో సమానమైనదై యున్నది. ఏ హేతువు నిమిత్తమైనను అసహనంగా ఉండుట దుర్మార్గతయని అనేకులు నమ్ముదురు. నిశ్చయముగా, అప్పుడప్పుడు అసహనము మంచి కాదు; కానీ దేవుడు దూషింపబడినప్పుడు, సత్యముపై దాడిచేయబడినప్పుడు, లేక దేవుని వాక్యమునకు ప్రత్యామ్నాయముగా ఒక అభిప్రాయము ఉంచబడినప్పుడు, అసహనమును అభివ్యక్తము చేయుటయే సరైనది. మనము అల్పబుద్ధిగల మనస్సుగలవారమై లేక ద్వేషపూరితులమై యుండకూడదు, కానీ మనము బైబిల్ ఉపదేశముల గూర్చి స్థిరముగా నిలచియుంటూ తప్పుడు నమ్మకములను మరియు అభ్యాసములను అంగీకరించుటకు నిరాకరించుచుండవలెను. యేసు ఇతర దేవతలు (4:10), విభజింపబడిన రాజభక్తి (12:30), మరియు దేవుని యొద్దకు యేసు గాక ఇతర మార్గములు కలవని బోధించుచుండిన వారి విషయంలోను (యోహాను 10:1-10; 14:6) తన అసహనమును అభివ్యక్తము చేసాడు.

దేవుని యొద్దకు దారి తీయు మార్గము ఇరుకైనది ఏలయనగా అది సత్యము మరియు పరిశుద్ధతతో కూడిన మార్గమై యున్నది. "విశాల దృక్పథంగలవారై" యుండుట కోరదగిన ప్రత్యేక లక్షణమని చెప్పబడుచున్నదన్నట్లుగా క్రైస్తవులు తరుచుగా "సంకుచిత మనస్తత్వంగలవారని" పిలువబడుచుందురు. ఈ వాక్యభాగములో యేసు సరిగ్గా ఇందుకు వ్యతిరేకమైనదానిని ఉద్బోధించాడు. "విశాల దృక్పథం" కలిగియుండుట మంచిది కాదనియు, "సంకుచిత మనస్తత్వం" కలిగియుండుట అవశ్యకమై యున్నదనియు ఆయన సెలవిచ్చాడు. "విశాల దృక్పథం" కలిగియుండుట మరియు "నిర్మోహమాటముగా" నుండుట ఒకే విషయం కాదు. "నిర్మోహమాటముగా" నుండుట మంచిది ఏలయనగా మనము సత్యమును వెదకుచు దానిని గ్రహించగలుగునట్లు అది మనకు సహాయకరముగా నుండును. దీనికి తారతమ్యముగా, విశాల దృక్పథం కలిగియుండుట అనగా వ్యతిరేకార్థకమైన ఏ దృక్పథమును, నైతికమును, లేక విభిన్న జీవిత విధానములనైనను అంగీకరించుటయై యున్నది. ఇందు మూలముననే మనము విశాల మార్గములో ప్రవేశించకూడదని యేసు మనలను హెచ్చరించాడు.

"కాగా మీ పాపములలోనే యుండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని; నేను ఆయనని మీరు విశ్వసించనియెడల, మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని" యేసు సెలవిచ్చాడు; మరియు, "సత్యమును గ్రహించెదరు, అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని" వారితో చెప్పాడు (యోహాను 8:24, 32). ఇంకా, "పరలోకమందున నా తండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింపబడునని" కూడ

యేసు చెప్పాడు (15:13). "సత్యమునకు భిన్నమైన బోధ చేయవద్దని ... కొందరికి ఆజ్ఞాపించుమనియు" (1 తిమోతికి 1:3–4), "నిన్ను గూర్చియు నీబోధను గూర్చియు జాగ్రత్త కలిగియుండుము; వీటిలో నిలకడగా ఉండుము, ఏలయనగా నీవీలాగుచేసి నిన్నును నీ బోధ వినువారందరిని రక్షించుకొందువనియు" (1 తిమోతికి 4:16) పౌలు తిమోతిని ప్రేరేపించాడు. నిత్య జీవమునకు దారి తీయు మార్గము బహు ఇరుకుగా నున్నది, మరియు దానిలో ప్రవేశించువారు కొద్దిమందియే.

### "ప్రభువా, ప్రభువా" (7:21–23)

కొందరు తండ్రి చిత్తము చొప్పున చేయుచుండలేదని వారు తీర్పు దినాన కనుగొనుట, అది ఎంత విషాదాంతమైన విషయమై యుండునుకదా! ఒకడు విశ్వసనీయమైన క్రైస్తవ జీవితం జీవించుచున్నాడని అతడు ఖచ్చితంగా తెలిసికొనగలడా? "మీరు విశ్వాసముగలవారై యున్నారో లేదో మిమ్మును మీరే శోధించుకొని చూచుకొనుడి; మిమ్మును మీరే పరీక్షించుకొనుడి! మీరు భ్రష్టులు కానియెడల–యేసు క్రీస్తు మీలో నున్నాడని, మిమ్మును గూర్చి మీరే యెరుగరా?" అని పౌలు రచించాడు (2 కొరింథీయులకు 13:5). మన జీవితములకు క్రైస్తవ కృపలను చేర్చుట ద్వారా మన "పిలుపు" "నిశ్చయము" చేసికొనగలమని పేతురు స్పష్టంగా తెలియజెప్పాడు (2 పేతురు 1:5–11).

---

సూచనలు

[1]Douglas R. A. Hare, *Matthew*, Interpretation (Louisville: John Knox Press, 1993), 76. [2]Mishnah *Sotah* 1.7; Talmud *Shabbath* 127b చూడు [3]Michael J. Wilkins, "Matthew," *in Zondervan Illustrated Bible Backgrounds Commentary,* vol. 1, *Matthew, Mark, Luke*, ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 50. [4]Talmud *Rosh ha-Shanah* 16b. [5]David Hill, *The Gospel of Matthew,* The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 146; *Leviticus Rabbah* 29.3 చూడు. [6]Craig S. Keener, *A Commentary on the Gospel of Matthew* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1999), 241. [7]Talmud *Arakhin* 16b; *Baba Bathra* 15b చూడు. [8]Talmud *Baba Metzia* 59b. [9]1 Maccabees 1:16, 41, 42, 47; 2 Maccabees 6:18-7:42. [10]టాల్ముడ్‌లో, ప్రాముఖ్యమైన ప్రసంగము కూడ "ముత్యముల" చేత గుర్తింపబడుచున్నది. (*Kiddushin* 39b.)

[11]"తట్టుట," టాల్ముడ్‌లో "ప్రార్థన"కు రూపకాలంకారముగా కూడ ప్రయోగింపబడుచు, మొర్దెకై "కనికరమను ద్వారములను తట్టెను గనుక అవి అతనికి తెరువబడినవని" చెప్పుచున్నది (Megillah 12b). [12]R. T. France, *The Gospel According to Matthew*, The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 144; Robert H. Mounce, *Matthew,* New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 66. [13]Edwin Firmage, "Zoology," in *The Anchor Bible Dictionary*, ed. David Noel Freedman (New York: Doubleday, 1992), 6:1147. [14]Hill, 149. [15]Confucius *Analects* 15.23. [16]Isocrates *Nicocles (The Cyprians)* 61. [17]Diogenes Laertius *Lives of Eminent Philosophers* 5.21. [18]Talmud *Shabbath* 31a. [19]Tobit 4:15 (NRSV). [20]Sirach 31:15 (NRSV).

[21]Letter of Aristeas 207. [22]లూకా 6:31లో యేసు ఇచ్చిన సువర్ణ సూత్రము, ఒకడు తన శత్రువులను సహితము ప్రేమింపవలెను, కానీ వారి యెడల ప్రతీకారము తీర్చుకొనకూడదను సందర్భములో అగుపించుచున్నది (లూకా 6:27–36 చూడు). [23]Mounce, 66. [24]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 133. [25]Talmud *Shabbath* 31a.

[26]France, 146. [27]Robert H. Gundry, *Matthew: A Commentary on His Literary and Theological Art* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 127. [28]France, 146. [29]యూదా మతోపదేశకుల సాహిత్యములో కూడ, రెండు బాటలు చిత్రీకరింపబడినవి. అవి పరదైసుకుగాని లేదా నరకమునకుగాని దారితీయును. (Talmud *Berakoth* 28b.) [30]Donald A. Hagner, *Matthew 1-13,* Word Biblical Commentary, vol. 33A (Dallas: Word Books, 1993), 178.

[31]Josesphus *Antiquities* 20.5.1, 2; *Wars* 2.13.5 చూడు. [32]*Didache* 11-13; 16.3; Ignatius *Philadelphians* 2.1, 2 చూడు. [33]Hill, 151. [34]మంచి ఫలముల గూర్చిన రిఫరెన్సుల కొరకు, యోహాను 15:8; గలతీయులకు 5:22–24; ఎఫెసీయులకు 5:9–12; కొలొస్సీయులకు 1:9–12; యాకోబు 3:17, 18 చూడు. [35]"ఆ దినము" గూర్చిన రిఫరెన్సులు కొరకు, మత్తయి 24:36; లూకా 10:12; 17:31; 21:34; 2 థెస్సలొనీకయులకు 1:9–10; 2 తిమోతి 1:12, 18; 4:8 చూడు. [36]తీర్పు దినమును గూర్చి వర్ణనల కొరకు, మత్తయి 24:36–51; 25:31–46; అపొస్తలుల కార్యములు 17:30, 31; 2 కొరింథీయులకు 5:10; ప్రకటన 20:11–15 చూడు. [37]Leon Morris, *The Gospel according to Matthew,* Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 182, n. 87. [38]Mounce, 70. [39]Wilkins, 53-54; Gordon Franz, "The Parable of the Two Builders," *Archaeology in the Biblical World* 3 (June 1995): 6-11 చూడు. [40]A. T. Robertson, *Word Pictures in the New Testament,* vol. 1, *The Gospel According to Matthew - The Gospel According to Mark* (Nashville: Broadman Press, 1930), 63.

[41]Mounce, 64. [42]Herbert Hoover, address to World's Conference of the Young Men's Christian Association (YMCA), Cleveland, Ohio, 8 August 1931. [43]ఈ సోదాహరణ చిత్రీకరణమునకు అసలు రచయిత ఎవరో తెలియదు.